# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :40 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: సోమవారం 01-04-2024 | పేజీలు:4 వెల: 2.00


### బీఎస్పీ ఎమ్మెల్యే హత్య కేసులో ఆరుగురికి జీవితకాల జైలుశిక్ష

న్యూఢిల్లీ: బీఎస్పీ ఎమ్మెల్యే రాజు పాల్ 2005లో హత్యకు గురయ్యాడు. ఆ కేసులో శుక్రవారం ప్రత్యేక సీబీఐ కోర్టు తీరును వెలువరించింది. ఆ కేసులో ఏడుమందిని దోషులుగా ప్రకటించింది. అయితే ఆరుగురికి జీవిత ఖైదు శిక్ష(Life Imprisonment)ను విధించారు. గత ఏడాది మర్డర్‌కు గురైన గ్యాంగ్‌స్టర్ అతిక్ అహ్మద్ కూడా ఈ కేసులో ప్రధాన నిందితుడు. ప్రత్యేక సీబీఐ జడ్జి కవితా మిశ్రా తీర్పును ఇచ్చారు. రంజీత్ పాల్, అబిద్, ఫర్హాన్ అహ్మద్, ఇస్రార్ అహ్మద్, జావెద్, గుల్‌హసన్, అబ్దుల్ కావి ఈ కేసులో నిందితులు. ఇస్రార్ అహ్మద్‌కు జీవిత కాల శిక్షను విధించలేదు. ఆరుగురికి జీవిత కాల శిక్షతో పాటు 11.65 లక్షల జరిమానా కూడా విధించారు. ప్రయాగ్‌రాజ్ ఎమ్మెల్యే రాజూ పాల్‌తో పాటు అతని అనుచరులు దేవి దిన్ పాల్, సందీప్ యాదవ్‌లను 2005, జనవరి 25వ తేదీన హత్య చేశారు. 2004 ఉప ఎన్నికల్లో అతిక్ అహ్మద్ సోదరుడు అష్రఫ్‌ను ప్రయాగ్‌రాజ్ వెస్ట్ సీటులో రాజ్ పాల్ ఓడించారు. ఆ కక్షతో బీఎస్పీ ఎమ్మెల్యేపై అప్పట్లో అటాక్ జరిగింది. అష్రఫ్ అహ్మద్‌కు చెందిన 9 మంది గ్యాంగ్.. పాల్ వాహనాన్ని అడ్డుకుని తుపాకులతో కాల్చి చంపారు.

## ఎగ్జిట్ పోల్స్ పై ఈసీ సంచలన నిర్ణయం!




న్యూఢిల్లీ,దేశవ్యాప్తంగా లోక్ సభ ఎన్నికలకు, కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలకూ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన సంగతి తెలిసిందే. దీంతో ఇప్పటికే బరిలో నిలిచే అభ్యర్థులపై ఒక క్లారిటీకి వచ్చిన ప్రధాన పార్టీలు.. ప్రచార కార్యక్రమాలపై దృష్టి పెట్టాయి. ఇందులో భాగంగా ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో బిజిగా ఉన్నాయి. ప్రస్తుతం ఏ మూల చూసినా ఇలాంటి సందడే కనిపిస్తుంది. ఈ సమయంలో ఎగ్జిట్ పోల్ ఫలితాలపై ఎన్నికల కమిషన్ సంచలన ప్రకటన చేసింది.అవును.. ఎన్నికలు సమీపిస్తున్నాయంటే... ఆయా రాజకీయ పార్టీలతో పాటు సర్వే సంస్థల సందడి కూడా బలంగా ఉంటుంది! పైగా ఈ మధ్య ఆ సందడి మరింత పెరిగిందని అంటున్నారు. ఇందులో భాగంగా.. ఇప్పటికే పలు సర్వేలు హల్ చల్ చేస్తున్నాయి. ప్రధానంగా లోక్ సభ ఎన్నికలకు సంబంధించిన సర్వేలు వైరల్ గా మారుతున్నాయి. ఇదే సమయంలో ఏపీలోనూ సర్వేల సందడి మొదలైంది.ఈ సమయంలో పలు ఏజెన్సీలు నిర్వహించే సర్వే ఫలితాలు... తర్వాత రాబోయే వాస్తవ ఫలితాలకు చాలా దగ్గరగా ఉంటుండగా.. మరికొన్ని మాత్రం పూర్తి వ్యతిరేకంగా ఉంటుంటాయి. దీంతో... వీరికి అంచనా వేయడం రాలేదా.. లేక, వారి వ్యక్తిగత అభిప్రాయాన్ని సర్వేల పేరుతో జనాలపై రుద్దే ప్రయత్నం చేశారా అనే సందేహం కూడా కలుగుతుంటుంది. ఈ సమయంలో సర్వేలు, ఒపీనియన్ పోల్స్ సంగతి కాసేపు పక్కనపెడితే... ఎగ్జిట్ పోల్స్ విషయంలో ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది!ఎన్నికల్లో జనం ఎవరికి ఓటు వేశారు అని తెలుసుకుని.. వాటి ఆధారంగా ఎవరు గెలుస్తారు, ఎవరు ఓటమిపాలవుతారు, ఏ పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశం ఉంటుంది వంటి విషయాలను వెల్లడిస్తుంటారు. వీటిని ఎగ్జిట్ పోల్ ఫలితాలు అంటారు! ఇవి పోలింగ్ అయిన రోజు రాత్రే వచ్చేస్తుంటుంటాయి! అయితే... ఒక దశలోనే జరిగిపోయే ఎన్నికల విషయంలో సంగతి కాసేపు పక్కనపెడితే... ఈ సారి దేశవ్యాప్తంగా ఏడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి.ఈ సమయంలో ఒక దశ ఎన్నికలు పూర్తవ్వగానే దాని ఎగ్జిట్ పోల్ ఫలితాలు విడుదల చేస్తే... వాటి ప్రభావం మిగతా దశల్లో జరిగే ఎన్నికలపై పడే అవకాశం ఉంది! దీంతో.. ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా... ఏడు దశల్లోనూ ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాతే ఎగ్జిట్ పోల్స్ అంశం తెరపైకి రావాలి తప్ప.. ఈలోపు రాకూడదని తెలిపింది!ఇందులో భాగంగా... ఎన్నికల ప్రక్రియలో తొలిదశ పోలింగ్ జరిగే ఏప్రిల్ 19 నుంచి చివరి దశ పోలింగ్ జరిగే జూన్ 1 వరకూ ఎటూంటి ఎగ్జిట్ పోల్ ఫలితాలను ప్రకటించకూడదంటూ ఎన్నికల కమిషన్ నిషేధం విధించింది. అంటే.. జూన్ 1 సాయంత్రం పోలింగ్ ముగిసిన తర్వాతే ఎగ్జిట్ పోల్ ఫలితాలు వెల్లడించేందుకు వీలుంటుందన్నమాట!

## షర్మిల ఎక్కడ కాంగ్రెస్ లో అయోమయం..



హైదరాబాద్,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తరువాత ఏపీలో కాంగ్రెస్ పార్టీ ఉనికే నామమాత్రంగా మిగిలిపోయింది. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు గడిచినా ఆంధ్రప్రదేశ్ ప్రజలలో ఆ పార్టీ పట్ల ఆగ్రహం చల్లారిన దాఖలాలు కనిపించడం లేదు. రాష్ట్ర విభజన అనంతరం ఉభయ తెలుగు రాష్ట్రాలలోనూ అధికారాన్ని కోల్పోయిన కాంగ్రెస్.. తెలంగాణలో బలంగా పుంజుకుంది. అధికారపగ్గాలు చేపట్టింది. తెలంగాణ రాష్ట్రాన్ని తన పోరాటం ద్వారా సాధించానని చెప్పుకుంటూ తెలంగాణ పితగా తనకు తానే కితాబులిచ్చేసుకున్న కేసీఆర్ పార్టీని ఆ రాష్ట్ర ప్రజలు ప్రతిపక్షానికి పరిమితం చేసేశారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ కు పట్టం కట్టారు. అయితే ఇది జరగడానికి పదేళ్లు పట్టింది.అయితే ఏపీలో మాత్రం అడ్డగోలు విభజన ఆగ్రహం ప్రజలలో ఇంకా చల్లారినట్లు కనిపించలేదు. ఈ నేపథ్యంలోనే దక్షిణాదిలో కర్నాటక, తెలంగాణలలో అధకారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏపీపై దృష్టి సారించింది. ఏపీలో పుంజుకోవాలంటే వైఎస్ బ్రాండ్ ను జగన్ నుంచి తమ పార్టీకి బదలాయించుకోవడమొక్కటే మార్గమని భావించింది. అందుకే వైఎస్ కుమార్తె వైఎస్ షర్మిలకు పార్టీ ఏపీ పగ్గాలు అప్పగించింది. షర్మిల అన్న జగన్ తో విభేదించి తెలంగాణలో తన తండ్రి పేరు మీద వైఎస్సార్టీపీ పార్టీని ఏర్పాటు చేసుకుని తన స్థాయిలో తాను రాజకీయం చేసుకున్నారు. అయితే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు అనూహ్యంగా ఆమె కాంగ్రెస్ కు మద్దతుగా ఎన్నికలలో తన పార్టీని పోటీ నుంచి పక్కన పెట్టేశారు.

ఆ తరువాత ఆమె పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేసి ఆ పార్టీ ఏపీ పగ్గాలు అందుకున్నారు. ఇలా ఏపీ కాంగ్రెస్ పగ్గాలు అందుకున్న షర్మిల అలా తన అన్నపై విమర్శల బాణాలు సంధించారు. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్ మైలేజీ పెరిగిందని పరిశీలకులు సైతం విశ్లేషించారు. సూటిగా జగన్ పైనే విమర్శనాస్త్రాలు సంధిస్తూ, తన తండ్రి వైఎస్ ఆశయాల సాధన కోసమే తాను కాంగ్రెస్ లో చేరి ఆ పార్టీ ఏపీ పగ్గాలు పట్టుకున్నానని కూడా గట్టిగా చెప్పారు. అంతేనా సొంత బాబాయ్ వివేకా హత్య కేసు ఛేదనలోలో కూడా జగన్ దర్యాప్తు సంస్థలకు అడుగడుగునా అడ్డుపడింది కూడా జగనేనని ఆమె విస్పష్టంగా ప్రకటించేశారు. వివేకా 5వ వర్ధంతి సభలో వివేకా కుమార్తె సునీతతో కలిసి వేదిక పంచుకుని, ఆ వేదిక సాక్షిగా తన అన్నకు ఓటు వేయవద్దని ప్రజలకు పిలుపు కూడా ఇచ్చారు. తాను కడప లోక్ సభ, లేదా పులివెందుల అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తాననీ ప్రకటించారు. ఇందు కోసం ప్రజాభిప్రాయ సేకరణ అంటూ కడప నేతలతో సమావేశం కూడా ఏర్పాటు చేశారు. అంతే ఆ తరువాత నుంచీ ఆమె అనూహ్యంగా మౌనముద్ర వహించారు. అంతే కాదు బహిరంగంగా ఎక్కడా సభలు సమావేశాలలో కనిపించడం లేదు.ఒక పక్క ఎన్నికల షెడ్యూల్ విడుదలై అన్ని పార్టీలూ ప్రచారంలో పరుగులు పెడుతుంటే.. ఏపీ కాంగ్రెస్ లో మాత్రం ఎన్నికల హడావుడి ఏమీ కనిపించడం లేదు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కనిపించడం లేదు. వినిపించడం లేదు. దీంతో రాజకీయవర్గాలలోనే కాకుండా కాంగ్రెస్ శ్రేణులలో కూడా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. షర్మిల కాడె వదిలేశారా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. సరిగ్గా ఈ సమయంలోనే ఇంత కాలం కుమారుడు జగన్ కు దూరంగా కుమార్తె షర్మిలతో ఉన్న వైఎస్ సతీమణి విజయమ్మ ఇడుపుల పాయలో జగన్ పక్కన ప్రత్యక్షమయ్యారు. జగన్ తన ఎన్నికల ప్రచార శంఖారావాన్ని ఇడుపులపాయ నుంచి బస్సుయాత్ర ద్వారా ప్రారంభించారు. ఆ సందర్భంగా ఇడుపులపాయలో ఏర్పాటు చేసిన సమావేశంలో విజయమ్మ పాల్గొన్నారు. కొడుకును బైబిల్ సాక్షిగా దీవించారు. దీంతో షర్మిల కూడా తన స్టాండ్ మార్చుకున్నారా అన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలిగా పార్టీలో ఉత్సాహం కలిగించేలా వరుస సభలూ సమావేశాలతో దూసుకుపోవాల్సిన తరుణంలో షర్మిల సైలెంట్ కావడం, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపిక వంటి కార్యక్రమాలకు ఇంకా శ్రీకారం చుట్టకపోవడంతో తెరవెనుక ఏదైనా జరిగిందా అన్న సందేహాలు సర్వత్రా వ్యక్తమౌతున్నాయి. తల్లి విజయలక్ష్మిని తనకు అనుకూలంగా చేసుకున్న జగన్ చెల్లి షర్మిలను తన వైపు తిప్పుకున్నారా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వీటన్నిటినీ నివృత్తి చేయాల్సిన షర్మిల ఇకనైనా మౌనం వీడాల్సిన అవసరం ఉందని పరిశీలకులు అంటున్నారు?

## కాంగ్రెస్ గూటికి కేకే కూతురు,పురాణం సతీష్..

హైదరాబాద్,గతేడాది జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో.. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ లోకి వలసలు పెరుగుతున్నాయి. మద్యం కుంభకోణంలో కవిత అరెస్ట్ అవ్వడం కూడా కారు ఖాళీ అవ్వడానికి ఒక కారణంగా చెప్పుకుంటున్నారు ఆ పార్టీ నేతలు. తాజాగా.. కేకే కూతురు, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ నేత పురాణం సతీష్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో.. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ ఛార్జి దీపదాస్ మున్షీ విజయలక్ష్మికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన సందర్భంగా పురాణం సతీష్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అవినీతిలో కూరుకుపోయిన పార్టీ అని ఆరోపించారు. అలాంటి పార్టీలో ఇన్నాళ్లు ఉన్నందుకు సిగ్గుగా ఉందన్నారు. మరోవైపు మాజీ మంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కావ్య కూడా కాంగ్రెస్ లో చేరనున్నారు. కడియం కావ్య కాంగ్రెస్ తరపున వరంగల్ ఎంపీగా పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది.లోక్ సభ ఎన్నికలు ముంగిట్లో ఉండగా.. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి భారీగా చేరికలు జరుగుతుండటం ఆ పార్టీకి ఊహించని షాకే. ఎప్పటికీ పార్టీని వీడరనుకున్నవారంతా కారు దిగేశారు. మరోవైపు హుజురాబాద్ లోనూ మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో భారీగా చేరికలు జరిగాయి. జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్న, పలువురు



నాయకులు కాంగ్రెస్ లో చేరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వారందరికీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇక కేకే కూడా కాంగ్రెస్ లో చేరతారన్న వార్తలపై సందిగ్ధత ఏర్పడింది. ఆయన కాంగ్రెస్ లో చేరుతారా ? లేదా అన్నది ప్రశ్నార్థకంగా ఉంది. కేకే, విజయలక్ష్మి కలిసే పార్టీలో చేరతారని వార్తలొచ్చిన నేపథ్యంలో.. మళ్లీ ఆయన ఆలోచనలో పడినట్లు సమాచారం. కేకే కుమారుడు విప్లవ్.. పార్టీ మారేముందు ఒక్కసారి ఆలోచించు నాన్న.. నీ నిర్ణయాన్ని మార్చుకో అని విజ్ఞప్తి చేశారు. పదవుల కోసం పార్టీ మారేవారంతా ఇప్పుడున్న పదవులకు రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## అప్పుడు ముందస్తుకు వెళ్లడమే ముంచేసిందా?



హైదరాబాద్,భారత రాష్ట్ర సమితి ప్రస్తుత దుస్థితికి ఆ పార్టీ 2018 ఎన్నికలలో (అప్పుడు పార్టీ పేరు టీఆర్ఎస్) ముందస్తుకు వెళ్లడమే కారణమా? అంటే పరిశీలకులు ఔననే అంటున్నారు. పదేళ్ల కిందట ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగింది. ఆ తరువాత 2014లో తెలంగాణ, విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకే సారి సార్వత్రిక ఎన్నికలతో పాటుగానే ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికలలో తెలంగాణలో బీఆర్ఎస్ (అప్పుడు టీఆర్ఎస్) ఏపీలో తెలుగుదేశం అధికారంలోకి వచ్చాయి. అయితే కేసీఆర్ మాత్రం ఐదేళ్ల పదవీ కాలం ముగియడానికి ఆరు నెలల ముందే అంటే 2018 డిసెంబర్ లోనే ముందస్తు ఎన్నికలకు వెళ్లారు. ఆంధ్రప్రదేశ్ లో మాత్రం సార్వత్రిక ఎన్నికలతో పాటుగానే 2019 ఏప్రిల్ లో ఎన్నికలు జరిగాయి. 2018 ఎన్నికలలో విజయం సాధించి కేసీఆర్ వరుసగా రెండో సారి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ పగ్గాలు చేపట్టారు. అప్పట్లో కేసీఆర్ వ్యూహాత్మకంగా ముందస్తుకు వెళ్లి మెరుగైన ఫలితాలు సాధించగలిగారంటూ ఆయనపై ప్రశంసల వర్షం కురిసింది. అయితే కేసీఆర్ అప్పట్లో ముందస్తుకు వెళ్లడం వల్ల ఈసారి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు సార్వత్రిక లతో పాటుగా కాకుండా ముందుగానే అంటే 2023 డిసెంబర్ లోనే జరిగాయి. 2018లో కేసీఆర్ కు ముందస్తుకు వెళ్లడం కలిసి వచ్చింది. కానీ నాడు కేసీఆర్ తీసుకున్న నిర్ణయం వల్ల 2023 ఎన్నికలలో ప్రతిపక్షానికి పరిమితం కావలసి వచ్చిందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. నాడు ముందస్తుకు వెళ్లాలన్న కేసీఆర్ నిర్ణయం వ్యూహాత్మక తప్పిదమని ఇప్పుడు పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. నాడు విపక్షాలను చిత్తు చేసిన వ్యూహంగా ప్రశంసలు గుప్పించిన వారే నేడు నాటి నిర్ణయం వ్యూహాత్మక తప్పిదంగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఎందుకంటే 2023 ఎన్నికలలో బీఆర్ఎస్ ఓటమి పాలై ప్రతిపక్షానికే పరిమితం అవ్వడమే కాకుండా పార్టీ అధినేత కేసీఆర్ స్వయంగా కామారెడ్డి స్థానం నుంచి పరాజయం పాలయ్యారు. ఈ పరాజయం పార్టీ స్థాయినీ, నైతిక స్థైర్యాన్నీ బాగా దెబ్బతీసిందనడంలో సందేహం లేదు. ఓటమి తరువాత పార్టీ పరిస్థితి రోజు రోజుకూ దిగజారిపోతున్నది. పార్టీ నేతలూ, ఎమ్మెల్యేలూ, ఎంపీలూ కూడా పార్టీని వీడుతున్నారు. గత పదేళ్లుగా ఎవరి సలహాలూ, సూచనలూ పట్టించుకోకుండా ఇష్టారీతిగా వ్యవహరించిన అధినాయకత్వం పట్ల బాహాటంగానే అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. అధికారంలో ఉన్న సమయంలో అధినేతకు సన్నిహితులుగా గుర్తింపు పొందిన కేకే, కడియం వంటి వారు కూడా కారు దిగేయడంతో బీఆర్ఎస్ మళ్లీ పుంజుకుంటుందా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మద్యం కుంభకోణం కేసులో కవితను ఈడీ అరెస్టు చేసిన సందర్భంలో తెలంగాణ ప్రజల నుంచి కూడా ఎటువంటి స్పందనా రాకపోవడం చూస్తుంటే ఆ పార్టీ పట్ల ప్రజలలో ఎంత వ్యతిరేకత ఉందో అవగతమైంది. ఈ పరిస్థితి రానున్న లోక్ సభ ఎన్నికలలో పార్టీపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని అంటున్నారు. ప్రస్తుతం పార్టీ పరిస్థితి అత్యంత దయనీయంగా ఉండటంతో ఇంకా పార్టీలో ఉన్న నేతలలో కూడా అంతర్మథనం ప్రారంభమైందని చెబుతున్నారు. 2018లో ముందస్తు ఎన్నికలకు వెళ్లి కేసీఆర్ వ్యూహాత్మకంగా దిద్దుకోలేని తప్పిదం చేశారని బాహాటంగానే వ్యాఖ్యలు చేస్తున్నారు. నాటి తప్పిదానికి ఇప్పుడు పార్టీ ఫలితం అనుభవిస్తోందని అంటున్నారు.


## ఐటీ నోటీసులపై కాంగ్రెస్ దేశవ్యాప్త ఆందోళన



న్యూఢిల్లీ, ఎన్నికల వేళ తమను ఐటీ నోటీసుల పేరుతో వేధిస్తున్నారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. రూ.1,823.08 కోట్లు చెల్లించాలని ఆదాయపన్ను శాఖ నుంచి కాంగ్రెస్‌కు శుక్రవారం నోటీసులు అందాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రతిపక్ష పార్టీని ఆర్థికంగా కుంగదీసేందుకు అధికార బీజేపీ 'పన్ను ఉగ్రవాదం'కు పాల్పడుతోందని కాంగ్రెస్ ఆరోపించింది. ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్‌తో కలిసి పార్టీ కోశాధికారి అజయ్ మాకెన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఆదాయపన్ను చట్టాలను బిజెపి తీవ్రంగా ఉల్లంఘిస్తోందన్నారు. ఎన్నికలు జరగనున్న అత్యంత కీలక సమయంలో ఐటీ శాఖను తమపై ప్రయోగించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడింది. ఇప్పటికే రూ.135 కోట్లు తమ ఖాతా నుంచి బలవంతంగా తీసుకున్నారని.. తాజాగా మరో 1,823.08 కోట్లు చెల్లించాలంటూ నిన్న నోటీసులు ఇచ్చారని పేర్కొంది. ఈ ఆర్థిక ఉగ్రవాదాన్ని తక్షణమే ఆపాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. "ఎలక్టోరల్ బాండ్స్ స్కామ్" ద్వారా భారతీయ జనతా పార్టీ (బిజెపి) 8,200 కోట్ల రూపాయలు వసూలు చేసిందని, "ప్రీ-పెయిడ్, పోస్ట్-పెయిడ్, పోస్ట్ రైడ్ లంచాలు, షెల్ కంపెనీల" మార్గాన్ని ఉపయోగించిందని రమేష్ ఆరోపించారు. బిజెపి (%దీభీ%) "పన్ను ఉగ్రవాదం"లో నిమగ్నమైందని జైరాం ఆరోపించారు. కాంగ్రెస్‌ను ఆర్థికంగా కుంగదీసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, అయితే తాము కుంగిపోవడం లేదని రమేష్ అన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రచారం కొనసాగుతుందని, తమ హామీలను దేశ ప్రజల్లోకి తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ త్వరలోనే దీనిపై సుప్రీంలో ఫైట్ చేయనుంది. ఐతే.. కాంగ్రెస్ ఆరోపణలను బీజేపీ తిప్పికొడుతోంది.

## సీఎం ఇంటి వద్ద వ్యక్తి హల్చల్.. ఆత్మహత్యాయత్నం

హైదరాబాద్,సీఎం రేవంత్ రెడ్డి నివాసం వద్ద గందరగోళం నెలకొంది. ఓ వ్యక్తి శనివారం మధ్యాహ్నం హల్చల్ చేశాడు. ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్యా యత్నం చేశాడు. రేవంత్ రెడ్డితో పాటు టీడీపీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన తనకు తగిన గుర్తింపు ఇవ్వట్లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అందుకనే తాను చనిపోవాలని అనుకున్నట్టు తెలిపాడు.ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్య చేసుకునే యత్నం చేశాడు. అతడిని అదుపులోకి తీసుకున్న సెక్యూరిటీ సిబ్బంది.. వెంటనే ఆస్పత్రికి తరలించారు. కాగా, ముఖ్యమంత్రి తనకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని అతను ఈ చర్యకు పాల్పడ్డట్టు తెలిపాడు. కాంగ్రెస్ పార్టీలోకి కొత్తగా వచ్చిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారు.. తనలాంటి కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని, అందుకే ఆత్మహత్యాయత్నం చేసినట్లు భూపాలపల్లికి



చెందిన కాంగ్రెస్ నేత కృష్ణ సాగర్ పేర్కొన్నాడు. దీనిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## మా ఎమ్మెల్యేలను టచ్ చేస్తే మీ ప్రభుత్వం కూలిపోతుంది

హైదరాబాద్: తెలంగాణలో బీజేపీ ఎమ్మెల్యేలను టచ్ చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కూలడం ఖాయమని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. అలాగే, తాము గేట్లు ఎత్తితే 48 గంటల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండదంటూ సంచలన కామెంట్స్ చేశారు.కాగా, ఏలేటి మహేశ్వర్ రెడ్డి శనివారం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న వసూళ్ల చిట్టా తమ దగ్గర ఉందన్నారు. హైదరాబాద్ డబ్బులు దేశ రాజకీయాల కోసం కాంగ్రెస్ వినియోగిస్తోందన్నారు. రంజిత్ రెడ్డిపై గతంలో రేవంత్ చేసిన ఆరోపణలు ఏమయ్యాయి. అప్పుడు రంజిత్ రెడ్డి అవినీతి చేశారని చెప్పిన రేవంత్ ఇప్పుడు ఎన్నికల్లో ఆయనకు ఓటు వేయాలని ఎలా అడగతారు ?. రాష్ట్రంలో బీజేపీ ఎమ్మెల్యేలను టచ్ చేసి చూడండి ఏం జరుగుతుందో మీకే తెలుస్తుందన్నారు. తమ పార్టీ గేట్లు ఎత్తితే 48గంటల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండదన్నారు. నితిన్ గడ్కరీ వద్దకు వెళ్లి షిండే



పాత్ర పోషిస్తానని కోమటిరెడ్డి అన్నది వాస్తవమన్నారు. అయితే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై ఎవరికీ నమ్మకం లేదన్నారు.

## సంపాదకీయం

**సోమవారం 01-04-2024**

# కుట్రలో భాగమే ఈ అరెస్టులు

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు దేశవ్యాప్తంగా చర్చనీయా ంశమైంది. ఈ అరెస్టు రాజకీయ కుట్రలో భాగమేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం ఉండటమే అందుకు ప్రధాన కారణమనేది జగమెరిగిన సత్యం. కేంద్రపాలిత ప్రాంతమైనప్పటికీ ఢిల్లీలోనూ ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వమే పాలన కొనసాగిస్తున్నది. ఇప్పటివరకు వంతులవారీగా కేంద్రంలో అధికారాన్ని అనుభవిస్తూ వస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు.. ఢిల్లీలోనూ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి, దేశ రాజధానిపై పూర్తిస్థాయిలో పట్టు సాధించాలని ప్రయత్నిస్తుంటాయి. 2013కు ముందువరకు ఆ పార్టీలు అనుకున్నట్టే జరిగింది. కానీ, ఆప్ రాకతో పరిస్థితి మారిపోయింది.ఆ పార్టీ మూలంగా దేశ రాజధానిలో రెండు జాతీయ పార్టీల ప్రభావం తగ్గుతూ వచ్చింది.విజ్ఞులైన ఢిల్లీ ఓటర్లు ఆదరించడంతో వరుసగా గెలుస్తూ వచ్చిన ఆప్.. అనతికాలంలోనే పంజాబ్, హర్యానా, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, గోవా, గుజరాత్ తదితర రాష్ట్రాలకు విస్తరించింది. బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయంగా ఆప్ ఎదుగుతూ వస్తున్నది.2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పెద్దఎత్తున ప్రచారం చేసింది. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా మందీమార్బలాన్ని ఆ పార్టీ రంగంలోకి దించింది. 50కు పైగా స్థానాల్లో గెలుస్తామని ఊదరగొట్టింది. కానీ, ఆ ఎన్నికల్లో కమలం పార్టీ ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఆప్ ఏకంగా 62 స్థానాల్లో జయకేతనం ఎగురవేసింది. ఆ తర్వాత పంజాబ్‌లోనూ ఆప్ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. గోవా, గుజరాత్‌లలో ఓట్లు, సీట్లు సాధించి జాతీయ పార్టీగా అవతరించింది.ఆప్ దినదినాభివృద్ధి చెందుతుండటం బీజేపీకి మింగుడుపడటం లేదనేది బహిరంగ రహస్యమే. రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా కేజ్రీవాల్ వల్ల నష్టం జరగకుండా రాజకీయంగా భారీ కుట్రలకు తెరలేపినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఎన్నడూ లేనివిధంగా ఢిల్లీ పరిపాలనకు సంబంధించిన చట్టాలను మారుస్తూ ఆర్డినెన్సు జారీచేయడం, మత ఘర్షణలను ప్రేరేపించడం, కేజ్రీవాల్‌పై హిందూ ద్రోహి అనే ముద్ర వేయడం, ఢిల్లీ ప్రభుత్వాన్ని కూల్చాలని చూడటం లాంటివన్నీ అందుకు నిదర్శనాలు. ఈ కుట్రలకు 2020 ఎన్నికల తర్వాత తెరలేచింది. అందులో భాగంగానే కరోనా సమయంలో ఆప్ నేతలపై దర్యాప్తు సంస్థల దాడులు మొదలయ్యాయి. నయానో, భయానో ఆప్ శాసనసభ్యులను తమవైపు లాక్కోవాలని బీజేపీ ప్రయత్నించింది. తమకు 40 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని స్వయానా కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించడాన్ని బట్టి ఆ విషయాన్ని అర్థం చేసుకోవచ్చు. మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ సైతం ఈ విషయాన్ని పలు సందర్భాల్లో ప్రస్తావించారు.గత కొన్నేండ్లుగా దర్యాప్తు సంస్థలు ఆప్ నేతలపై దాడులను తీవ్రతరం చేశాయి. ఇప్పటికే ఆ పార్టీకి చెందిన ఇద్దరు కీలక నేతలు జైలులో ఉన్నారు. ఎన్నికల్లో కేజ్రీవాల్ ప్రచారం చేయకూడదనే ఉద్దేశంతోనే ఇదే అదనుగా భావించి ఆయనను అదుపులోకి తీసుకున్నారనేది అందరికీ తెలిసిందే.ఢిల్లీలో భూమి, శాంతిభద్రతలు మినహాయించి మిగిలిన పాలనాపరమైన విధులన్నీ అక్కడి ప్రజాప్రభుత్వమే చూసుకుంటుంది. 2023లో ఈ అధికారాలను చేజిక్కించుకోవాలనే దురుద్దేశంతో కేంద్రం ప్రభుత్వం ఒక ఆర్డినెన్సు తీసుకొచ్చింది. లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఎక్కువ అధికారాలను కట్టబెడుతూ.. ఢిల్లీ ప్రభుత్వమంటే ఎల్జీ అన్నట్టుగా ఆర్డినెన్సును రూపొందించింది. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్న ఈ ఆర్డినెన్స్‌ను పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఆప్‌ను దెబ్బకొట్టాలనే ఉద్దేశంతో రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ.. ఇటీవల రిటర్నింగ్ అధికారిని అడ్డం పెట్టుకొని ఛండీగఢ్ మేయర్ పీఠాన్ని బీజేపీ దక్కించుకున్నది. ఈ వ్యవహారాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించి, ఆప్ అభ్యర్థినే విజేతగా ప్రకటించింది.రాజకీయ కుట్రలో భాగంగానే సరైన ఆధారాలు లేనప్పటికీ దర్యాప్తు సంస్థలను విపక్షాలపైకి కేంద్రం ఉసిగొల్పుతున్నది. విపక్ష పార్టీల బ్యాంకు ఖాతాలను సీజ్ చేయడం, ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయడమే అందుకు నిదర్శనం. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన ఇటువంటి చర్యలను బీజేపీ మానుకో వాలి. లేకపోతే భవిష్యత్తులో కేంద్రపాలిత ప్రాంతాల్లో ఆందోళనలు తలెత్తడం ఖాయం. రాష్ట్ర హోదా కోసం ఇప్పటికే లద్ధాఖ్‌లో నిరసనలు జరుగుతున్నాయి. కేంద్రపాలిత ప్రాంతాల్లోనూ ప్రజా ప్రభుత్వాల ఏర్పాటు దిశగా కేంద్రం చర్యలు ఉండాలే తప్ప ఇలా పెత్తనం చెలాయించాలని చూడటం సరికాదు.

# ఉచితాలలకు హద్దు లేదా!



న్యూఢిల్లీ,ఉచిత పథకాలు రాజ్యాంగబద్ధమా? అనే అంశం మరలా తెరపైకి వచ్చింది. గతంలో దీనిపై అనేక చర్చలు జరిగాయి. అత్యున్నత న్యాయస్థానం వరకూ వెళ్ళింది. ఎన్నికల సంఘం దీనిని పరిశీలన చేయాలనే సూచనలు వచ్చాయి. ప్రధాన మంత్రి మోడీ అధికారమే పరమావధిగా సంక్షేమాన్ని ఏమాత్రం పెంచని ఉచితా లు ఆర్థికాభివృద్ధికి ఆటంకం అంటూ ప్రకటన కూడా చేశారు. తాజాగా మరలా సుప్రీం కోర్టులో ఈ ఉచితాలు అనుచితం అంటూ ఓ ప్రజాప్రయోజన వాజ్యం దాఖలైంది. సుప్రీం కోర్టు కూడా ఈ పిల్ స్వీకరించి దీనిని అత్యంత ప్రాముఖ్యత గల అంశంగా ప్రకటించడం జరిగింది. దేశంలో ఆర్థిక సమతుల్యత చాలా ముఖ్యం. అందరి దగ్గరా సమానంగా డబ్బు ఉండకపోవచ్చు. కనీస అవసరాలైనా అందరికీ తీరేలా ఉండాలన్నది రాజ్యాంగ మౌలిక సూత్రం. ఈ ఉద్దేశం తోనే కొన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. అయితే కాలం గడుస్తున్న కొద్దీ సంక్షేమం అనేది శృతిమించి..ఉచితాలు తెరపైకి వచ్చాయనే అభిప్రాయాలున్నాయి. అన్నం పెడితే ఒక పూట ఆకలి తీరుతుంది. కానీ అన్నం సంపాదించుకునే మార్గం చూపితే జీవితాంతం ఆకలి తీరుతుంది. జీవితాంతం ఆకలి తీర్చే మార్గం చూపడమే నిజమైన అభివృద్ధి. కానీ ప్రభుత్వాలు మాత్రం శాశ్వత పరిష్కారం వైపు కాకుండా తాయిలాలు పేరిట ఉపశమనాలు కల్పిస్తూ సంక్షేమం అని గొప్పగా చెప్పుకుంటున్నాయి. దేశం మొత్తం మీద అన్ని ప్రభుత్వాలు పోటాపోటీగా ఈ రకమైన ఉచిత పథకాల ప్రవాహాన్ని కొనసాగిస్తున్నాయి. అధికారాన్ని దక్కించుకోవడమే పరమావధిగా ఎన్నికల ముందు అమలు సాధ్యంకాని ఉచిత హామీలను ఇచ్చే రాజకీయ పార్టీలు పని చేస్తున్నాయి. దీనికి ఏ రాజకీయ పక్షం కూడా మినహాయింపు కాదు. ఎందుకంటే వీరు అందరూ కూడా ఒక తానులో ముక్కలే. పదవులే పరమావధిగా అధికారమే అంతిమ లక్ష్యంగా ప్రజలకు ఉచిత వరాల జల్లులు కురిపిస్తున్నారు.అంతేకాదు ఉచిత వరాల ప్రక్రియ అనేది ఒక వేలం పాటలా తయారు అయింది. ఒక రాజకీయ పక్షం ఒక ఉచితం ప్రకటిస్తే దానిని మించి మరో రాజకీయ పక్షం పోటీగా ప్రకటనలు చేస్తున్నది. శ్రేయోరాజ్య స్థాపనే లక్ష్యంగా గల ప్రభుత్వాలు సంక్షేమం కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేయడంలో తప్పులేదు. అది ప్రజాస్వామ్య ప్రభుత్వాల బాధ్యత కూడా. దేశంలో దారిద్ర్యంతో ఇబ్బందిపడుతున్న, ఆకలి కోరల్లో చిక్కుకున్న ప్రజానీకాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. అయితే ఈ బాధ్యత నిర్వహించే సందర్భంలో సంక్షేమం, అభివృద్ధి ఈ రెండూ కూడా జోడెద్దుల బండిలాగ కలిసిమెలిసి ప్రయాణం చేసే రీతిలో ప్రభుత్వాలు నడుచుకోవాలి. దీనిలో ఏ ఒక్కటి విస్మరించినా ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం కావడం ఖాయం. అయినా ప్రస్తుత ప్రభుత్వాలు ఈ లక్ష్యాలను పక్కన పెట్టి అధికారమే పరమావధిగా ఓటు బ్యాంకు రాజకీయాలతో జనాకర్షక ఉచిత పథకాలను ప్రకటిస్తూ ముందుకు పోతున్నాయి.దీని వలన ప్రభుత్వ ఆదాయంలో సగభాగం ఉచిత తాయిలాలకు మిగిలిన సగభాగం ఉద్యోగుల జీతాలకు పోతున్నది. అటువంటప్పుడు అభివృద్ధి జరిగే అవకాశం ఎక్కడ ఉంటుంది. అభివృద్ధికి సంక్షేమానికి తారతమ్యం లేకుండా పోతూ ఉంది. ప్రజలు గతంలో సమష్టి ప్రయోజనాల కోసం నాయకులను డిమాండ్ చేసే వారు. అది కాలక్రమేణా వ్యక్తిగత ప్రయోజనాల వైపు మరలిపోయింది. దీనిని గ్రహించిన నాయకులు అదే దిశగా ప్రయాణం చేసి ప్రజలను వ్యక్తిగతంగా సంతృప్తి పరచడంలో తలమునకలవుతున్నారు. అయితే ఇవన్నీ ఉపశమనాలు తప్ప శాశ్వత పరిష్కారం కాదని నాయకులకు తెలుసు.శాశ్వత పరిష్కారానికి దీర్ఘకాలిక లక్ష్యాలు ఉండాలి. అవి లేకపోతే ఎప్పటికీ పేదరికం అంతం కాదు. అయితే ఆర్థిక అసమానతలు అసాధారణంగా పెరుగుతున్న మన ఎగుడుదిగుడు సమాజంలో అట్టడుగు నుంచే బడుగు, బలహీన వర్గాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. పైగా, మనది సంక్షేమ రాజ్యమని రాజ్యాంగంలో రాసుకున్నాం. అభివృద్ధిలో వారినీ భాగస్వాముల్ని చేసేలా సమ్మిళిత ప్రగతి అవసరం. అందుకై చేపట్టే సంక్షేమ కార్యక్రమాల పట్ల ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ, ఆ ముసుగులో యోగ్యతలు, అర్హతలతో నిమిత్తం లేకుండా అమలు చేసే పథకాలు అమలు ఎప్పటికీ సమర్థనీయం కాదు. సమష్టి ప్రయోజనాలు కోసం చేపట్టే ఉచిత పథకాలు అన్నీ ఉత్పాదకమైనవిగానే భావించాలి.ఎందుకంటే ఉచిత వైద్యం, ఉచిత విద్య ఇలాంటివి ఉత్పాదకతను మెరుగు పరుస్తాయి. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర వస్తువుల అందించడం, మధ్యాహ్న భోజన పథకం, అంగన్ వాడీల ద్వారా పిల్లలకు, మహిళలకు పోషకాహారాన్ని అందించడం ఏ ఆధారం లేని వృద్ధులుకు, వితంతువులకు, వికలాంగులకు ఇచ్చే ఫించన్, రైతు బంధు, రైతు భరోసా వంటి పథకాలు వలన ఎన్నో సత్ఫలితాలు వస్తున్నాయి. ఇటువంటి వాటిని లక్ష్యం నెరవేరే వరకూ ఎప్పటికీ కొనసాగించాలి. దీనికి ఎవరూ అభ్యంతరం చెప్పరు. అదే మీరు ఒక కులానికి చెందిన వారు మీ వయసు ఇంత దాటితే నగదు బదిలీ చేస్తాం అనే పథకాలు వ్యక్తిగత ప్రయోజనాలు తప్ప సామాజిక సంక్షేమాన్ని పెంచవు. అయితే దీనికి భిన్నంగా మా ప్రభుత్వం అధికారం లోనికి వస్తే కలర్ టివి ఇస్తాం. మిక్సీ ఇస్తాం, మొబైల్ ఫోన్ ఇస్తాం, గ్రైండర్ ఇస్తాం, స్కూటీ ఇస్తాం, బంగారం ఇస్తాం అంటూ కొన్ని ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి.వినోదం, విలాసాలను ఉచితంగా ఇవ్వడం సంక్షేమం అవుతుందా? మతపరమైన యాత్రల కు ఉచిత రవాణా సౌకర్యం కల్పించడం, వివాహాలకు బహుమతి అందించడం వంటి వాటిని సంక్షేమ కార్యక్రమాలు అనవచ్చా? దీనికి పోటీగా రాజకీయ పక్షాలు ఈ తరహా మరిన్ని తాయిలాలు ప్రకటించుకుంటూ పోతే నిధులు ఎక్కడ నుంచి వస్తాయి అనే ఆలోచనే ప్రభుత్వాలకు స్ఫురించడం లేదు. దీనితో పాటు ఎవరి కోసం సంక్షేమ కార్యక్రమాలు రూపకల్పన చేసి నిధులు ఖర్చు చేస్తే ఆ వర్గ ప్రయోజనాలు మెరుగవ్వాలి. అయితే సంక్షేమ ఉచితాలను పొందే వారిలో దాదాపు 30% శ్రీమంతులు ఉన్నారు. ఇది కూడా ప్రభుత్వాలకు తెలియంది కాదు. పేద ప్రజలకు చెందాల్సిన సంక్షేమ నిధులు శ్రీమంతులకు కట్టబెట్టి సమాజంలో మరింత ఆదాయ అసమానతల పెంపుకు ప్రభుత్వాలు సహకరిస్తున్నాయి. ఏది సంక్షేమ కార్యక్రమం, ఏది కాదు అనే తేడా కూడా గుర్తించలేనంత స్థితిలో నేడు ప్రభుత్వాలు నడుస్తున్నాయి. పేదలకు అందించే ఉచిత పథకాలను విమర్శించేవారు పెద్దలకు అందించే ప్రయోజనాలు గురించి మాట్లాడటం లేదు.ఒక వ్యవస్థ ద్వారా పేదలకు ఇచ్చే కొద్దిపాటి మొత్తాలను ఉచితాలు అంటున్నారు. కానీ తక్కువ పన్ను రేట్లు, మినహాయిం పుల పేరుతో నిత్యం ధనవంతులు పొందుతున్న ఉచితాలను మాత్రం ప్రోత్సాహకాలు అంటున్నారు ఇదెక్కడి న్యాయం అంటూ సామాజిక వేత్తలు ప్రశ్నిస్తున్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంపుదల, సామాజిక అభివృద్ధి సాధన కోసం ప్రభుత్వాలు దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పథకాలు ఎప్పటికీ కొనసాగించాలి. అయితే ప్రజాకర్షణ కోసం సర్కారు ఖజానాని దివాలా తీయించే ఉచిత తాయిలాల ప్రకటన ఏ మాత్రం సమర్ధనీయం కాదు. అధికారమే పరమావధి ఓటు బ్యాంకు రాజకీయాలతో ఉచిత పథకాలు నగదు బదిలీ వంటివి చేస్తూ ఇది కూడా సంక్షేమమే అంటూ ఆర్థిక క్రమశిక్షణ గతి తప్పించడాన్ని ఎవరూ క్షమించకూడ దు.సంక్షేమ పథకాల ముసుగులో రాయితీలు, ఉచితాలు, ఇతర తాయిలాలతో ప్రలోభపెట్టి రాజకీయ పబ్బం గడుపుకునే రాజకీయ పక్షాలకు ఓటర్లు చెక్ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చాలా సందర్భాలలో ప్రభుత్వాలు ప్రకటించి న ఉచిత పథకాలు పొందే లబ్ధిదారు లు సైతం ముక్కున వేలేసుకుని ఆశ్చర్యపోతున్నారు. ఈ డబ్బు అంతా ఎక్కడ నుంచి తీసుకువస్తారని ప్రభుత్వాలకు ఆ మాత్రం స్పృహ లేదు. ఏదిఏమైతేనేం అధికారం కావాలి.. నిధులు కొరత అయితే కొత్త పన్నులు వేస్తారు. అదీ సాధ్యం కాకపోతే రుణాలు చేస్తారు. దురదృష్టం ఏమిటంటే నేడు దేశంలో రాష్ట్ర ప్రభుత్వాలకు వచ్చే ఆదాయం మొత్తం జీతాలు, పెన్షన్లు, వడ్డీలు చెల్లించడానికి సరిపోవడం లేదు. కేంద్రం నుంచి ఆదాయం, కొత్త అప్పుల ద్వారా ఉచితాల సంతర్పణ చేసుకుంటూ పోతూ భావితరాల ప్రయోజనాలను తాకట్టు పెట్టే అధికారం మనకు ఎక్కడిది?

# కరీంనగర్ గెలుపు కోసం 'హస్తం' ఆపరేషన్ ఆకర్ష్..



కరీంనగర్ :కరీంనగర్ పార్లమెంట్ స్థానాన్ని గెలిచేందుకు 'హస్తం' పార్టీ పక్కా వ్యూహంతో వెళ్తున్నట్టుగా కనిపిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా విపక్ష పార్టీల నుంచి వలసలకు గేట్లు తెరిచిన కాంగ్రెస్ హైకమాండ్ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కీలక నేతలను కలుపుకునేందుకు ఆపరేషన్ ఆకర్ష్ మొదలుపెట్టింది. బరిలో నిలిచిన విపక్ష పార్టీల అభ్యర్థులిద్దరూ ఉద్దండులే కావడంతో వారిని ఢకొట్టే మాస్టర్ ప్లాన్‌లో భాగంగానే కరీంనగర్ గులాబీ కీలక నేతలతో మంతనాలు మొదలయ్యాయనే టాక్ పొలిటికల్ సర్కిల్‌లో చక్కర్లు కొడుతోంది. రెన్నెళ్లుగా పార్టీ నేతల అరెస్టులు, వారిపై పెరుగుతున్న కేసుల నడుమ అధికార పార్టీలో చేరితే తప్ప మనుగడ ప్రశ్నార్థకంగా ఉంటుందనే ఒత్తిళ్లు బీఆర్ఎస్ కీలక నేతలపై పెరిగినట్టు వినిపిస్తోంది. ఈ క్రమంలోనే మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ కమలం పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరారు.రాష్ట్ర వ్యాప్తంగా లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ.. కరీంనగర్ సీటు మాత్రం పెండింగ్‌లో పెట్టింది. గతంలో ఇక్కడి నుంచి ఎంపీగా పని చేసి, తరువాత ఎన్నికల్లో పోటీ చేసిన సీనియర్ నాయకుడు పొన్నం ప్రభాకర్ ప్రస్తుతం హుస్నాబాద్ ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేస్తున్నారు. ఆ స్థానాన్ని భర్తీ చేయగల పొన్నం స్థాయి నాయకుడు కరువయ్యాడు. పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచిన బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల్దిరూ ఉద్దండులే కావడంతో వారిని ఢకొట్టేందుకు సరితూగే అభ్యర్థితోపాటు పార్టీ బలాన్ని పెంచే పనిలో కాంగ్రెస్ హైకమాండ్ పడింది. అందులో భాగంగానే కరీంనగర్ పార్లమెంట్‌పై దృష్టిసారించినట్టు కనిపిస్తోంది.

**విపక్ష నేతలతో మంతనాలు..**

కరీంనగర్ పార్లమెంట్ పధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రస్తుతం మానకొండూర్, చొప్పదండి, వేములవాడ, హుస్నాబాద్ స్థానాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండగా.. సిరిసిల్ల, కరీంనగర్, హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ శాసనసభ్యులు ఉన్నారు. సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మిన%ుà% మిగిలిన ఇద్దరినీ కాంగ్రెస్‌లో చేర్చుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కరీంనగర్ నేతపైనే ఫోకస్ పెట్టిన 'హస్తం' హైకమాండ్ రహస్యంగానే మంతనాలు జరుపుతూ ఆయన్ను అష్టదిగ్బంధనం చేస్తోందనే టాక్ పొలిటికల్ సర్కిల్‌లో చక్కర్లు కొడుతోంది. భూకబ్జా కేసుల్లో రిమాండ్ అవుతున్న స్థానిక సంస్థల నేతల్లో ఆయన అనుచరులూ ఉండటంతో అధికార పార్టీలో చేరాలనే ఒత్తిళ్లు ఎమ్మెల్యేపై ఉన్నట్టుగా కనిపిస్తోంది. రాష్ట్రంలో బీఆర్ఎస్ కీలక నేతలుగా పేరుగాంచిన వారే కాంగ్రెస్‌లో చేరుతుండగా.. కరీంనగర్ ఎమ్మెల్యే పార్టీ మారడం పెద్ద విషయం కాదనే చర్చ కూడా సాగుతోంది. అయితే ప్రస్తుతం హుస్నాబాద్ నుంచి గెలిచి మంత్రిగా ఉన్న పొన్నం కరీంనగర్‌లో తిరిగి తన పట్టు నిలుపుకునే పనిలో పడ్డారు. తనకు పోటీగా గంగుల కమలాకర్ రాకను ఆయన తిరస్కరించే అవకాశాలూ లేకపోలేదు. మరోవైపు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బంధువైన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పార్టీ మారే వ్యక్తుల్లో ముందువరుసలో ఉంటారనే చర్చ మొదట్లోనే వచ్చింది. అయితే తాను పార్టీ మారే ప్రసక్తే లేదని, ప్రాణం ఉన్నంత వరకూ కేసీఆర్ వెంటే ఉంటానని కౌశిక్‌రెడ్డి ప్రకటించారు. అయినప్పటికీ మారుతున్న పరిస్థితుల్లో పార్టీ మారే అవకాశాలు లేకపోలేదనే అభిప్రాయాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. వీరిరువురే గాకుండా బీఆర్ఎస్‌లోని స్థానిక సంస్థల కీలక నేతలపైనా కాంగ్రెస్ దృష్టిసారించింది.

**విపక్షసభ్యులిద్దరూ ఉద్దండులే!**

కరీంనగర్ లోక్‌సభ పోరులో బీఆర్ఎస్ నుంచి బోయినపల్లి వినోద్‌కుమార్, బీజేపి బండి సంజరు ఇద్దరూ ఉద్దండులేనని చెప్పొచ్చు. సుదీర్ఘ రాజకీయానుభవం, ఈ స్థానం నుంచే ఎంపీగా పని చేసిన అనుభవం సహా తమతమ పార్టీల్లో కీలక నేతలుగా ఎదిగారనే చెప్పొచ్చు. ప్రస్తుతం బరిలో ఫైనల్ అయిన వారిద్దరినీ ఢకొట్టేందుకు కాంగ్రెస్ ఆచితూచి అడుగులు వేస్తోంది.అందుకు బలమైన రాజకీయపునాదులున్న అభ్యర్థి కరువడంతో విపక్ష పార్టీలను బలహీనపరిచే పనిలో కాంగ్రెస్ పడింది. బీఆర్ఎస్, బీజేపీ కేడర్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకునే పనిని వేగిరం చేసింది. ఇప్పటికే ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలోని స్థానిక సంస్థల నేతల్లో పదుల సంఖ్యలో కాంగ్రెస్ గూటికి చేరారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన మానకొండూర్ బీజేపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే ఆ పార్టీకి శుక్రవారం రాజీనామా చేసి.. తిరిగి తన మాతృపార్టీ కాంగ్రెస్‌లో చేరారు.

# అమెరికా సంబంధం... రూ.2.7 కోట్లు నొక్కేశాడు

హైదరాబాద్,దూరపు కొండలు నునుపు అంటారు.. దగ్గరికి వెళ్తే కానీ అసలు విషయం అర్థం కాదు. ఆ యువతీకి కూడా అలాంటి అనుభవమే ఎదురయింది. ఇప్పుడు జరిగింది తలుచుకుని కుమిలి కుమిలి ఏడుస్తోంది. హైదరాబాదులోని మదీనాగూడకు చెందిన ఓ యువతి (30) స్థానికంగా ఐటి కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. ఇంట్లోవాళ్లు పోరు పెడుతుండడంతో తన ప్రొఫైల్ ను ఓ మ్యాట్రిమోనీ సంస్థలో నమోదు చేసింది. ఆమె ప్రొఫైల్ చూసిన విజయవాడకు చెందిన శ్రీ బాల వంశీకృష్ణ (37) కాంటాక్ట్ అయ్యాడు. ఇద్దరు ఫోన్లో మాట్లాడుకునేవారు. అభిరుచులు కలవడంతో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. "నేను ఎప్పటినుంచో అమెరికాలో ఉంటున్నా. నిన్ను పెళ్లి చేసుకున్న తర్వాత ఇక్కడికి తీసుకొస్తానని" వంశీకృష్ణ చెప్పడంతో ఆ యువతి నమ్మింది. అయితే ఇక్కడే వంశీకృష్ణ తన అసలు సిసలైన చీటింగ్ ప్రణాళిక అమలు చేయడం మొదలు పెట్టాడు.ఇందులో భాగంగా ఆమె సిబిల్ స్కోర్ తెలుసుకున్నాడు. అయితే ఆ స్కోర్ 743 మాత్రమే ఉండడంతో వీసా రాదని చెప్పాడు. అమెరికా వీసా రావాలంటే 845 ఉండాలని నమ్మబలికాడు. ఇంతటి సిబిల్ స్కోర్ ఉండాలంటే తన దగ్గర ఒక ప్రణాళిక ఉందని చెప్పాడు. వివిధ కంపెనీల నుంచి రుణాలు ఇస్తానని ప్రకటించాడు. ఇలా ఆమెకు మాయమాటలు చెప్పి ఏకంగా ?2.71 కోట్లు కొట్టేశాడు.. అతడు చెప్పినప్పుడల్లా ఆ యువతి వంశీకృష్ణ బ్యాంకు ఖాతాకు డబ్బులు బదిలీ చేయడం మొదలుపెట్టింది. ఇలా 2.71 కోట్లు అతడికి ఆమె పంపించింది. అయినప్పటికీ ఆమె సిబిల్ స్కోర్ పెరగలేదు. దీంతో అనుమానం వచ్చిన ఆ యువతి తెలిసిన వాళ్లని అడిగితే.. సిబిల్ స్కోర్ పెరగాలంటే రుణాలు తీసుకోవడం ఏంటని? సిబిల్ స్కోర్ లేకుంటే బ్యాంకులు రుణాలు ఎలా ఇస్తాయని? ఆమెకు అర్థమయ్యేలా చెప్పారు. దీంతో తాను మోసపోయానని ఆ యువతి భావించింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఆ యువతి చెప్పిన వివరాల ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ మొదలుపెట్టారు. అయితే వంశీకృష్ణ అమెరికాలో ఉంటున్నప్పటికీ.. అతడు అక్కడ ఎటువంటి ఉద్యోగం చేయడం లేదని తెలిసింది. మదీనాగూడకు చెందిన యువతి మాత్రమే కాకుండా చాలామంది మహిళలను పెళ్లి పేరుతో మోసం చేశాడని పోలీసుల విచారణలో తేలింది. 2011 నుంచి ఇప్పటివరకు అతని మీద 9 కేసులు నమోదయ్యాయి. వీసాల పేరుతో ఎంతో మంది అమ్మాయిలను మోసం చేసి పది కోట్ల వరకు కొట్టేశాడు. తన వివరాలను మ్యాట్రిమోనీలో పెట్టడం.. అందమైన యువతుల వివరాలు సేకరించడం.. ఫోన్లలో గంటలు గంటలు మాట్లాడడం.. అమెరికా వీసా పేరుతో వారిలో లేనిపోని ఆశలు కల్పించడం.. ఆ తర్వాత డబ్బులు వసూలు చేయడం.. వంశీకృష్ణ పరిపాటిగా మార్చుకున్నాడు. పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని ప్రకటించారు. అతడి వీసాను రద్దు చేసేందుకు ఇమ్మిగ్రేషన్ అధికారులతో మాట్లాడుతున్నట్టు తెలిసింది

# కూతురు వయస్సు ఉన్నఅమ్మాయితో ఏఎస్ఐ రాసలీలలు

కరీంనగర్, ఉద్యోగాల కల్లా పోలీసు ఉద్యోగం చాలా ప్రత్యేకమైనది. ఎందుకంటే సమాజంలో అన్ని వర్గాల వారు తమ సమస్యలను పరిష్కరించమని కోరేది పోలీసులనే. వారికేదైనా సమస్య ఎదురైతే ముందుగా తొక్కేది పోలీస్ స్టేషన్ గడపే. అయితే అటువంటి పోలీసు శాఖకు కొంతమంది అధికారులు మచ్చ తెస్తున్నారు. సమస్య మీద తమను కలిసిన వారి బలహీనతలను ఆసరాగా చేసుకుని ఇబ్బంది పెడుతున్నారు. అలాంటి ఏఎస్ఐ ఉదంతం ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.జగిత్యాల జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామానికి చెందిన 23 సంవత్సరాల ఓ యువతి భర్త తాగుడుకు బానిస అయ్యాడు. ప్రతిరోజు రాత్రి మద్యం తాగి వచ్చి ఆమెను కొడుతున్నాడు. పెద్ద మనుషులు సర్ది చెప్పినప్పటికీ అతడి ప్రవర్తనలో మార్పు రాలేదు. విసిగి వేసారి పోయిన ఆ యువతి పోలీసులను ఆశ్రయించింది. తన భర్త పెడుతున్న బాధలను ఫిర్యాదు రూపంలో పోలీసులకు అందజేసింది. ఆ సమయంలో అక్కడే ఉన్న ఏఎస్ఐ రాములు.. ఆ యువతి భర్తను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చాడు. అయినప్పటికీ ఆ యువతి భర్త మారలేదు. పైగా మరింతగా ఆమెను కొట్టడం మొదలుపెట్టాడు. దీంతో ఆ యువతి మళ్లీ పోలీస్ స్టేషన్ గడప తొక్కింది. ఇలా పలుమార్లు రావడంతో.. ఈఎస్ఐ ఆమెపై కన్నేశాడు. విచారణ పేరుతో ఆమెను ముగ్గులోకి దింపాడు. తరచూ ఆమెతో ఫోన్లో మాట్లాడేవాడు. ఇలా ఆమెకు దగ్గరయ్యాడు. అయితే ఈ విషయం ఆ పోలీస్ స్టేషన్ ఎస్ఐ దృష్టికి వెళ్ళింది. దీంతో ఆయన మెట్ పల్లి సర్కిల్ ఇన్ స్పెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆ సీఐ ఏఎస్ఐని మందలించారు. ఉన్నతాధికారులకు చెప్పకండని, త్వరలో తనకు పదవి విరమణ ఉందని చెప్పి బతిమిలాడారు. తన వ్యవహార శైలి మార్చుకుంటారని సీఐ కాళ్లు మొక్కినట్టు తెలుస్తోంది.అయితే ఆ ఏఎస్ఐ ఆ యువతితో అత్యంత సన్నిహితంగా దిగిన ఫోటోలు కొద్దిరోజులుగా సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. మెట్ పల్లి లోని వాట్సాప్ గ్రూపుల్లో ఈ ఫోటోలు హల్ చల్ సృష్టించాయి. దీంతో పోలీసులు ఆ ఏఎస్ ఐ పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. కాగా, ఆ ఏఎస్ఐ పై గతంలోనూ ఈ తరహా ఆరోపణలు ఉన్నట్టు తెలుస్తోంది. విచారణ పేరుతో ఆ యువతిని ముగ్గులోకి దించి.. అన్ని రకాలుగా దగ్గరయ్యాడని తెలుస్తోంది. తరుచూ ఆమె ఇంటికి వెళ్లడం.. తన వాహనంలో ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లడం.. వంటివి చేస్తుండేవాడని.. అలా చేయడం వల్లే ఆయన రాసలీల వ్యవహారం ఎస్పై దృష్టికి వెళ్లిందని అక్కడి పోలీస్ స్టేషన్ సిబ్బంది చెబుతున్నారు. కాగా ఏఎస్ఐ వయసు 53 సంవత్సరాలు.. అతడికి 23 సంవత్సరాల నుంచి వయసు ఉన్న పిల్లలు ఉన్నట్టు తెలుస్తోంది. ఆ ఏఎస్ఐ వ్యవహార శైలి పట్ల స్థానికులు మండిపడుతున్నారు. రిటర్మెంట్ కు దగ్గరగా ఉన్న సమయంలో ఇదేం పాడు పనంటూ దుమ్మెత్తి పోస్తున్నారు.

# ఊసరవెల్లి కన్నా అధ్వాన్నం వివేక్ రాజకీయం

మందమర్రి,బీఆర్ఎస్‌ను కుటుంబ పాలన అని విమర్శించిన ఎమ్మెల్యే వివేక్.. తన కుటుంబంలో ఇద్దరికి ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ టికెట్ ఇవ్వడం కుటుంబ పాలన కాదా అని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ప్రశ్నించారు. ఆస్తులను కాపాడుకునేందుకే ఊసరవెల్లి రంగులు మార్చినట్లుగా వివేక్ కుటుంబం పార్టీలు మారుతూ అధికారం కోసం పాకులాడుతున్నారని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా పెద్దపల్లి ఎంపీ నియోజకవర్గంలోని మందమర్రిలో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి బాల్కసుమన్ ప్రచారం నిర్వహించారు. గత 50 ఏండ్లుగా వివేక్ కుటుంబాన్ని ప్రజలు ఆదరిస్తే ఈ ప్రాంతంలో ఒక్క ఫ్యాక్టరీ కూడా పెట్టలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది ఆగర్భ శ్రీమంతుడికి, భూగర్భ గని కార్మికుడికి మధ్య జరుగుతున్న పోటీ. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందరని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. తనకు సింగరేణి బొగ్గు కార్మికుల సమస్యలపై పూర్తి అవగాహన ఉందని చెప్పారు.

## రాజకీయం అంటే ప్రజలకు సేవ చేయడమే

అమరావతి,రాజకీయం అంటే ప్రజలకు సేవ చేయడమేనని ఎన్‌టీఆర్ నిరూపించారని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ఈ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కార్యకర్తలు, నేతలకు ఎక్స్(ట్విటర్) వేదికగా చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయం అంటే అధికారం అనుభవించడం కాదు.. ప్రజలకు సేవచేయడమని ఎన్టీఆర్ నిరూపించారని కొనియాడారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్యకర్తలు, నేతలకు శుభాకాంక్షలు తెలిపారు. కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, పొట్టి శ్రీరాములు, అంబేద్కర్, జ్యోతిబా పూలే వంటి మహనీయుల స్ఫూర్తితో 1982లో ఇదే రోజున ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని ప్రకటించారని గుర్తుచేశారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు కేవలం ఓటర్లుగా మిగిలిపోకుండా రాజకీయాలను శాసించే స్థాయికి వెళ్లాలనే ఉద్దేశంతో పార్టీ, ప్రభుత్వంలో కీలక బాధ్యతలు ఇచ్చారని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా టిడిపి కృషి చేస్తోందని అన్నారు. ఇక ముందూ ఇదే అంకితభావంతో బంగారు భవిష్యత్తు కోసం కృషి చేస్తామని చంద్రబాబు తెలిపారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం పుట్టింది తెలుగుదేశమని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. ఈ మేరకు ఎక్స్ (ట్విటర్) వేదికగా పోస్టు చేశారు. అణగారిన వర్గాలకు అండగా నిలిచింది పసుపు జెండా అని పేర్కొన్నారు. 'సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు' అన్న ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం శ్రమిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం కదిరిలో నిర్వహించిన టిడిపి ఆవిర్భావ వేడుకల్లో చంద్రబాబు పాల్గొన్నారు. ఉండవల్లిలో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన కుమార్తె, చంద్రబాబు భార్య భువనేశ్వరి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

## ఎన్నికలకు దూరంగా ...

హైదరాబాద్, మారిన రాజకీయ పరిణామాలతో దేశవ్యాప్తంగా విస్తరించాలని ప్రస్తుత ఉద్యమ పార్టీ తెలంగాణ రాష్ట్ర సమితి.. బీఆర్ఎస్‌గా మారింది. రాజకీయాల్లో పరమపదగిగా ఆవిర్భవించిన పార్టీ చరిత్రలో తొలిసారిగా పార్టీ వ్యవస్థాపకులు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కుటుంబం లోక్‌సభ ఎన్నికలకు దూరంగా ఉంటోంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, అతని కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరు 2004 నుండి ప్రతి పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తూనే ఉన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆయన కుమారుడు కేటీ రామారావు, కేసీఆర్ మేనల్లుడు టి.హరీష్ రావుల్లో ఎవరో ఒకరు ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయవచ్చని ఊహాగానాలు వచ్చాయి. అయితే ఆ ముగ్గురు ఎమ్మెల్యేల్లో ఒక్కరు కూడా ఎన్నికల బరిలోకి దిగలేదు. గతంలో ఎంపీగా గెలిచిన కవిత లిక్కర్ స్కామ్ కేసుతో ఈసారి ఎన్నికలకు దూరంగా ఉన్నారు. నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి 2019 ఎన్నికల్లో కేసీఆర్ కుమార్తె కె.కవిత ఈసారి పోటీ చేయడం లేదు. తెలంగాణ లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యురాలిగా ఉన్న ఆమెను ఇటీవల ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ స్కామ్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసి తీహార్ జైలుకు పంపించింది. ఈసారి లోక్ సభ ఎన్నికల్లో మొత్తం 17 స్థానాలకు బీఆర్ఎస్ పార్టీ తమ అభ్యర్థులను ప్రకటించింది.2001లో తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు తెలంగాణ రాష్ట్ర సమితిని స్థాపించారు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు. తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసిన కేసీఆర్ 2004లో కరీంనగర్ నుంచి లోక్‌సభకు ఎన్నికై కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వంలో కేంద్ర మంత్రి అయ్యారు. 2006, 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన అదే స్థానాన్ని నిల బెట్టుకున్నారు.2009లో కేసీఆర్ మహబూబ్‌నగర్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఈ కాలంలోనే తెలంగాణ రాష్ట్ర లక్ష్యాన్ని సాధించడంలో విజయం సాధించారు.2014లో తెలంగాణలో టీఆర్ఎస్ తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు. మరోసారి అసెంబ్లీకి ఎన్నికైన ఆయన కుమారుడు, మేనల్లుడు ఆయన కేబినెట్‌లో మంత్రులు అయ్యారు. ఏకకాలంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్ కూతురు కవిత నిజామాబాద్ నుంచి లోక్ సభకు ఎన్నికయ్యారు. 2018లో టీఆర్ఎస్ అధికారాన్ని నిలబెట్టుకోగా, 2019 ఎన్నికల్లో నిజామాబాద్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ చేతిలో కవిత ఓడిపోయారు. ఆ తర్వాత ఆమె శాసనమండలికి ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ చేతిలో అధికారాన్ని కోల్పోయింది.మే 13న ఎన్నికలు జరగనున్న మొత్తం 17 స్థానాలకు అభ్యర్థులను బీఆర్ఎస్ ప్రకటించింది. తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమతూకం పాటించామని ఆ పార్టీ పేర్కొంది. అభ్యర్థుల ఎంపికలో కేసీఆర్ సామాజిక సమీకరణలను పరిశీలించి, తద్వారా అన్ని వర్గాల విశ్వాసాన్ని పొందేలా అభ్యర్థుల ఎంపిక చేసినట్లు గులాబీ పార్టీ నేతలు తెలిపారు. అభ్యర్థుల జాబితాను పరిశీలిస్తే వెనుకబడిన కులాల నుంచి ఆరుగురు, షెడ్యూల్డ్ కులాల నుంచి ముగ్గురికి, షెడ్యూల్డ్ తెగల నుంచి ఇద్దరికి, ఇతర కులాల నుంచి ఆరుగురికి బీఆర్ఎస్ టికెట్లు దక్కాయి.2019లో తొమ్మిది స్థానాలను కైవసం చేసుకున్న బీఆర్ఎస్ ముగ్గురు సిట్టింగ్ ఎంపీలు ? నామా నాగేశ్వరరావు (ఖమ్మం), మాలోత్ కవిత (మహబూబాబాద్), మన్నె శ్రీనివాస్ రెడ్డి (మహబూబ్‌నగర్)లకు మరోసారి అవకాశం కల్పించింది. ఐదుగురు సిట్టింగ్ ఎంపీలు ఇతర పార్టీలకు ఫిరాయించగా, ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఒక సిట్టింగ్ ఎంపీ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఇక ప్రజల మద్దతున్న నాయకులను ఎంపిక చేయడం ద్వారా, ప్రత్యర్థులతో పోలిస్తే వీరికి మంచి అవకాశాలు ఉన్నాయని బీఆర్ఎస్ భావిస్తోంది.ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని, ఈ భావన మరింత బలపడుతోందని గులాబీ పార్టీ విశ్వసిస్తోంది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల్లో తన విజయాన్ని నమోదు చేసేందుకు పార్టీ సన్నాహాలు చేస్తోంది. కొంతమంది అభ్యర్థులు ఇప్పటికే నియోజకవర్గాల్లో పర్యటించి ప్రజలకు చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నారు. తమకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని గులాబీ పార్టీ పేర్కొంది. అన్ని నియోజకవర్గాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజల ఆదరణ పొందేందుకు పార్టీ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు సన్నద్ధమవుతున్నారు. ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేసేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరలో నియోజకవర్గాల్లో పర్యటించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

### చీపురుపల్లిలో కిమిడి నాగార్జున రాజీనామా

చీపురుపల్లి,ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ–జనసేన–బీజేపీ మధ్య పొత్తు ఏర్పడిన నేపథ్యంలో, ప్రతి ఒక్కరికీ టికెట్ కేటాయించలేక ఈ మూడు పార్టీలు అసంతృప్త జ్వాలలను ఎదుర్కొంటున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తోన్న తరుణంలో తెలుగుదేశం పార్టీకి షాక్ తగిలింది. విజయనగరం జిల్లా చీపురుపల్లి టీడీపీ ఇంచార్జి, జిల్లా పార్టీ అధ్యక్ష పదవికి కిమిడి నాగార్జున రాజీనామా చేశారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు టీడీపీ నుంచి కిమిడి నాగార్జున టికెట్ ఆశించారు. ఈ క్రమంలోనే టికెట్ దక్కకపోవడంతో మనస్తాపం చెందిన నాగార్జున ఈ నిర్ణయం తీసుకున్నారు.చీపురుపల్లి సీటును కిమిడి కళా వెంకట్రావుకు అధిష్టానం కేటాయించింది. దీంతోనే ఆయన మనస్తాపానికి గురయ్యారు.

# ఎన్టీఆర్‌కు వెన్నుపోటును మరచిపోగలమా !

విజయవాడ,తెలుగు ప్రజల ఆత్మగౌరవం నినాదంతొ ప్రాంతీయ పార్టీని పెట్టిన ఎన్టీఆర్ అదే పార్టీలో తన సొంత అల్లుడు చంద్రబాబు చేతిలోనే ఘోర పరాభవానికి గురయ్యారు. ఇది కళ్లముందున్న చరిత్ర. అదే ఎన్టీఆర్ జపం చేస్తూ ఇప్పుడు బాబు ఊరేగుతున్నారు. ఈ విషయాలను సరిగ్గా ఎన్నికల సమయంలో అధికార వైకాపా పదేపదే ప్రస్తావించి బాబును దెబ్బకొట్టే ప్రయత్నాలు చేస్తోంది. పార్టీ ఆవిర్భావ సంబరాలు జరుపుకుంటున్న వేళ ప్రధానంగా ఎన్టీర్ పదవీచ్యుతి గురించి చర్చించాలి. ఎన్టీఆర్‌ను గద్దెదించి అధికారం చేపట్టిన చంద్రబాబునాయుడు నాటి చీకటి రోజుల గురించి చర్చించాలి. లక్ష్మీపార్వతిని అడ్డం పెట్టుకుని ..ఆమెను బూచిగా చూపి ఎన్టీఆర్‌కు బాబు వెన్నుపోటు పొడిచారు. నేటికీ ఈ ఘటనపై ఏనాడు కూడా చంద్రబాబు కానీ, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు కానీ క్షమాపణలు కోరలేదు. తెలుగుదేశం పార్టీని, సిఎం పదవిని వెన్నుపోటుతో లాక్కున్న చంద్రబాబు ఏనాటికీ క్షంతవ్యుడు కాదని కొడాలి నాని లాంటి వారు నిత్యం విమర్శిస్తూనే ఉన్నారు. ఎన్టీఆర్ పదవీచ్యుతుడు కాకుండా ఉండివుంటే ఆయన ప్రధాని పదవిని అధిష్టించేవారని కొందరి అభిప్రాయం. ఇకపోతే ఎన్టీఆర్ బొమ్మకు దండలు వేయడం మాత్రం చంద్రబాబు బాగా అలవాటు చేసుకున్నారు. రెండెకరాల ఆసామి అయిన చంద్రాబాబు రాజకీయాల్లో వేలకోట్లు ఎలా సంపాదిం చాడో చర్చించాలి. కాంగ్రెస్ హయాంలో ఇందిర ప్రధానిగా ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఎన్టీఆర్ పార్టీని స్థాపిస్తే అదే కాంగ్రెస్‌తో చంద్రబాబు తన రాజకీయ ప్రాపకం కోసం జట్టుకట్టాడు. తెలుగువారి ఆత్మగౌరవం ఢిల్లీ పెద్దల పాదాల కింద పడి నలుగుతున్న రోజుల్లో... మాటిమాటికి ముఖ్య మంత్రులను మారుస్తూ, వారిని అవహేళన చేస్తూ, కీలుబొమ్మలుగా ఆడిస్తున్న రోజుల్లో... తెలుగు వారంటే మద్రాసీలుగా పరిగణిస్తున్న రోజుల్లో.. తెలుగువారి ఆత్మగౌరవ నినాదం ఎత్తుకున్న ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారు. కాంగ్రెస్ పాలనపై ఎన్టీఆర్ దండయాత్రచేశారు. పార్టీ పెట్టిన 9 నెలల్లో పార్టీని అధికారం లోకి తీసుకుని వచ్చి సంచలనం సృష్టించారు. తెలుగు ప్రజల పౌరుష ప్రతాపాలకు పదును పెట్టగల కార్యశూరుడి ఎన్టీఆర్ ఆవిర్భవించారు. అద్భుతమైన పాలన అందించారు. కానీ నమ్మి నెత్తిన పెట్టుకున్న సొంత అల్లుడు చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు కలసి వెన్నుపోటు పొడిచారు. నాటి గవర్నర్ కృష్ణకాంత్‌ను అడ్డంపెట్టుకుని అధికారాన్ని చంద్రబాబు చెర పట్టారు. ఈ క్రమంలో చంద్రబాబు క్యారెక్టర్‌పై టిడిపి కార్యకర్తలు చర్చించాలి. ఓట్లేసి గెలిపించిన నేతను పదవీచ్యుతుడిని చేశారు. సొంత మామ అన్న కనీస గౌరవం లేకుండా పదవికోసం అక్రమ రాజకీయాలకు, వెన్నుపోటు రాజకీయాలకు చంద్రబాబు పాల్పడిన తీరుపై తెలుగుజాతి మండిపడుతోంది. చంద్రబాబు ఆ తరవాత ఎప్పుడూ సొంతంగా ఏనాడూ గెలవలేదు. వాజ్‌పేయ్ హవాలో,మోడీ హవాలో మాత్రమే గెలిచిన సందర్భం గమనించాలి. ఎన్టీఆర్ సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తే బాబు దానికి తూట్లు పొడిచే మద్యానికి బార్లాగా గేట్లు తెరిచారు. ఇవాళ మద్యపాన నిషేధం గురించి జగన్ ప్రభుత్వాన్ని నిలదీస్తున్న టిడిపి లేదా చంద్రబాబు.. ఆనాడు ఉమ్మడి ఎపిలో మద్యపాన నిషేధాన్ని ఎందుకు ఎత్తివేశారో చెప్పాలి. ప్రజలు దీనిని నిలదీయాలి. నిజానికి ఓ సమున్నత లక్ష్యంతో ఎన్టీఆర్ మద్యపాన నిషేధాన్ని తీసుకుని వచ్చారు. ఎన్టీఆర్ నుంచి అధికారన్ని లాక్కున్న చంద్రబాబు అలా ఎన్టీఆర్ పథకాలకు తూట్లు పొడిచారు. కిలో రెండు రూపాయల బియ్యాన్ని ఐదు రూపాయలకు పెంచారు. జనతా వస్త్రాలను పక్కన పెట్టారు. పేదలను విస్మరించి పెద్దలతో జతకట్టారు. ఇన్ని రకాలుగా టిడిపిని భ్రష్టు పట్టించిన చంద్రబాబు ఇవాళ ఎన్టీఆర్‌ను తలచుకుంటూ.. ఆయనకు నివాళి



అర్పించినంద మాత్రాన పాపాలు కడిగేసుకున్నట్లు కాదు. 1982 మార్చి 29న ఎన్టీఆర్ పార్టీ ప్రకటించిన సందర్భం ఓ ఉద్విగ్నమైనది. ఆరోజు హైదరాబాద్, సాయకాలం పూట న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్.. ఎన్టీఆర్ అభిమానులతో ఆ ప్రాంగణం సందడిగా ఉంది. తెలుగువారి తెరవేలుపు నందమూరి తారకరామారావు పార్టీ ప్రకటన చేస్తారని తెలియడంతో యువత కూడా పెద్ద ఎత్తున వచ్చింది. ప్రాంగణం జనంతో నిండిపోయింది. అప్పుడే ఎన్టీఆర్ రావడంతో కోలాహలం మొదలయ్యింది.. రాజకీయ ప్రవేశం గురించి చెప్పిన ఎన్టీఆర్ పార్టీ పేరు కూడా అక్కడే ప్రకటించారు. ఓ అరగంట పాటు ప్రసంగించారు. పార్టీ పేరు తెలుగుదేశం అని అనగానే కేరింతలు, చప్పట్లతో ఆ ప్రాంగణం మారుమోగింది. అలా తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించింది. ప్రాంతీయపార్టీల చరిత్రలోనే ఓ కొత్త శకానికి నాంది పలికింది. ఆనాడు పార్టీ ప్రకటించిన సందర్భంలో ఈనాటి చంద్రబాబు లేడు. ఆయన కాంగ్రెస్ పార్టీలో మంత్రిగా ఉన్నాడు. ఎన్టీఆర్ పై పోటీచేసి ఓడిస్తానని ప్రకటించాడు. అలా ప్రకటించి ఎన్నికల్లో ఓడిపోయాడు. తరవాత అల్లుడు అన్న ట్యాగ్‌తో పార్టీలో చేరి ఎన్టీఆర్‌నే మింగిన ఘనుడు చంద్రబాబు. దీనిని చరిత్ర కాదనలేని సత్యం. అలా పార్టీని ప్రకటించిన ఎన్టీఆర్ చైతన్య రథం సిద్దం చేసుకుని.. కుమారుడు హరికృష్ణ సారథిగా ముందుకి కదిలారు. తెలుగుదేశం పిలుస్తోంది..రా..కదలిరా అనే నినాదం ఊరూరా మార్మోగింది. ప్రజల అభిమానానికి దాసోహమంటూ అడుగడుగునా ఆయనకు జననీరాజ నాలు పలికారు. రాష్ట్రచరిత్రలో అలాంటి చైతన్య యాత్ర మరొకటి లేదనిపిస్తుంది. దశాబ్దాల చరిత్ర ఉన్న జాతీయ కాంగ్రెస్ పార్టీని.. కొన్ని నెలల వయసున్న పసికందు లాంటి పార్టీ చిత్తు చేసి ఓడించడం చరిత్ర లోనే అపూర్వం. ఆ ఘనత ఎన్టీఆర్‌కే దక్కింది. ఎన్టీఆర్ ప్రచార ప్రభంజనం కాంగ్రెస్ అధికార మదాన్ని మట్టికరిపించింది. కేవలం తొమ్మిదినెలల క్రితం అంకురార్పణ జరిగిన పార్టీ అధికారపార్టీ అంచనాలకి అందని రీతిలో అపూర్వ విజయం సాధించింది. 1983 జనవరి 7న మధ్యాహ్నం ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. తెలుగుదేశం 199 సీట్లు సాధించింది. కాంగ్రెసుకి కేవలం అరవై మాత్రమే దక్కాయి. ఈ విజయం రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లోనే ఓ అద్భుత విజయం. పోటీ చేసింది ఎవరైనా ఎన్టీఆర్ బొమ్మ పెట్టుకుంటే చాలు విజయం వరించింది. తెలుగుదేశం జెండా రాష్ట్రం నలుమూలలా సగర్వంగా రెపరెపలాడింది. అలా కాంగ్రెస్‌లో ఓటమిపాలైన చంద్రబాబు అధికారంలో ఉన్న ఎన్టీఆర్ పంచన చేరి.. మామకే వెన్నుపోటు పొడిచన తీరు తెలుగుజాతి ఏనాడు మరచిపోదు.

# భువనగిరి కోటపై ఎర్రజెండా ఎగరాలి



భువనగిరి: 'ఉద్యమమే ఊపిరిగా పనిచేస్తున్నా. సీపీఐ(ఎం)ను ప్రజలు గెలిపిస్తే నేను ప్రజలను గెలిపిస్తాను. బూర్జువా పార్టీల నాయకులను గెలిపిస్తే వారు ప్రజలను ఓడిస్తారు. ఈ తేడాను అందరూ గమనించాలి. భువనగిరి కోటపై ఎర్రజెండాను ఎగరేస్తాం. అందుకు అన్ని తరగతుల ప్రజలు, మేధావులు, రైతులు, కార్మికులు, విద్యార్థులు, యువకులు, మహిళలు, వృత్తిదారులు సీపీఐ(ఎం) అభ్యర్థిని గెలిపించాలి. అవకాశవాద రాజకీయ నాయకులను ఈ ఎన్నికల్లో ఓడించాలి. నేను గెలిచినా, ఓడినా జనంలోనే ఉంటా. కానీ బూర్జువా పార్టీల నాయకులు గెలిచినా, ఓడినా ఎక్కడుంటారో అర్థం చేసుకోవాలి.'అని భువనగిరి సీపీఐ(ఎం) పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థి ఎండీ జహంగీర్ అన్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఆయన నవతెలంగాణ ప్రతినిధి బొల్లె జగదీశ్వర్‌కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే 'మాది యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం మునిపంపుల గ్రామం. మా తల్లిదండ్రులు బీజాన్‌బీ, మహబూబ్‌అలీ. మా గ్రామంలో పార్టీ నిర్మాతల్లో వారు ముఖ్య నాయకులు. హోటల్ వ్యాపారం చేసేవారు. 1970–71లో కరువు వచ్చింది. జనం ఆకలితో అలమటిస్తున్నారు. పార్టీ పిలుపు మేరకు జొన్నల లారీని అడ్డగించి పేదలకు పంచారు. అప్పుడు మా తండ్రిని పోలీసులు మూడు రోజులపాటు పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు. కాచం కృష్ణమూర్తి, నర్రా రాఘవరెడ్డి ప్రభావం మా కుటుంబంపై ఉంది. నా తల్లిదండ్రుల ప్రభావం వల్లే రాజకీయాల్లోకి వచ్చాను. 'అని జహంగీర్ చెప్పారు.'1992లో పూర్తికాలం కార్యకర్తగా వచ్చాను. 1995లో 25 ఏండ్ల వయస్సులోనే మునిపంపుల గ్రామ సర్పంచ్‌గా అత్యధిక మెజార్టీతో ప్రజలు గెలిపించారు. అప్పుడు విరాళాల ద్వారా వచ్చిన డబ్బు రూ.2,002 నా ఎన్నికల ఖర్చు. 2016, అక్టోబర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా పార్టీ కార్యదర్శిగా పనిచేస్తున్నాను. చదువు వెలుగు, సారా వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నాను. లంచం ఇవ్వకు, లంచం అడక్కు అనే ఉద్యమం చేపట్టాం.'అని జహంగీర్ అన్నారు.'అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలకు తేడా ఉంటుంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలు మార్పు కోరుకున్నారు. బీఆర్ఎస్ అహంకారపూరిత విధానాలను ప్రజలు ఈసడించుకున్నారు. స్థానికంగా ఉన్న పరిస్థితులు ప్రభావం చూపుతాయి. ఎమ్మెల్యేల పనితీరు కూడా ప్రభావితం చేస్తుంది. పార్లమెంటు ఎన్నికలపై ఆ ప్రభావం ఉండదు. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గంలో 17 లక్షల ఓట్లున్నాయి. ప్రజలు ఆచితూచి ఆలోచించి ఓట్లేస్తారు. పదేండ్ల నుంచి అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌ను అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించినట్టుగానే కేంద్రంలో ఉన్న బీజేపీని కూడా ప్రజలు ఓడిస్తారు.'అని జహంగీర్ చెప్పారు.'సాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నది. జనగామలో దేవాదుల ప్రాజెక్టు కాలువల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. దీంతో భూములకు నీరందడం లేదు. భువనగిరిలో బస్వాపురం ప్రాజెక్టు పూర్తి కాలేదు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రాజెక్టులను ఎన్నికల అస్త్రంగానే కాంగ్రెస్, బీఆర్ఎస్ వాడుకుంటున్నాయి. ఉదయసముద్రం ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో తెలియదు. నిర్దిష్ట కాలపరిమితిలోగా ప్రాజెక్టులను పూర్తి చేస్తామనే దమ్ము ఈ ప్రభుత్వానికి ఉన్నదా?. నీరులేక పొలాలు బీడుబారుతున్నాయి. ఇక్కడి ప్రజలకు మూసీ జీవనాధారంగా ఉన్నది. సీఎం రేవంత్‌రెడ్డి గొప్పగా చెప్పినా బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించారు. కానీ ఆ ప్రాజెక్టు పూర్తి కావాలంటే రూ.58 వేల కోట్లు కావాలి. ఈ ప్రాంతానికి గోదావరి జలాలను తేవాల్సిన అవసరముంది.'అని జహంగీర్ సూచించారు.'ఉన్నత విద్య, ఇంజినీరింగ్, మెడిసిన్ కోసం ఇక్కడి విద్యార్థులు హైదరాబాద్‌కు వెళ్లాలి. జిల్లా ఆస్పత్రులను సూపర్‌స్పెషాలిటీ చేస్తామంటూ కేసీఆర్ ఇచ్చిన హామీ అమలు కాలేదు. బీబీనగర్‌లో ఎయిమ్స్ ఉన్నా 42 విభాగాలకుగాను 26 విభాగాలే పనిచేస్తున్నాయి. 1500 నుంచి రెండు వేల మంది ఓపీకి రోజూ వస్తున్నారు. కంప్యూటర్లు లేక ఆరు కౌంటర్లే ఉన్నాయి. ఎయిమ్స్‌కు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిధులివ్వకుండా వివక్షతను చూపుతున్నది'అని జహంగీర్ చెప్పారు.'ప్రభుత్వాలు మారుతున్నా ప్రజల బాధలు తీరడం లేదు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, టీడీపీ ఒక్కతాను ముక్కలే. జిల్లాల అభివృద్ధి కోసం ఆ పార్టీలు ఏం చేశాయో బహిరంగ చర్చకు రావాలి. ఎందుకు వెనుకబడి ఉన్నామో చెప్పాలి. పాలకుల వైఫల్యమే ఈ దుస్థితికి కారణం.'అని జహంగీర్ అన్నారు.'పోరాటాల ఉనికి, ఆనవాళ్లు ఇంకా ఉన్నాయి కాబట్టే కమ్యూనిస్టుల పట్ల ప్రజల్లో గౌరవం ఉన్నది. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్న వారు ఇప్పుడు లేకపోవచ్చు. ఆ చరిత్ర సజీవంగా ఉన్నది. ఆ పోరాటానికి వారసులుగా కమ్యూనిస్టులున్నారు. కానీ సాయుధ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరిస్తున్నది. అందులో భాగంగానే రజాకార్ సినిమాను తీశారు. అందులో ఎర్రజెండా కనిపించదు, ఆ పోరాటాలుండవు. ఎర్రజెండా లేకుండా నిజాం వ్యతిరేక పోరాటం ఉన్నదా?. బీజేపీకి చరిత్ర లేదు కాబట్టే ఈనాటి తరం దాన్ని తెలుసుకోవద్దనే కుట్రతోనే వక్రీకరిస్తున్నారు. పాఠ్యాంశాలను తొలగిస్తున్నారు. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలు చారిత్రాత్మకమైనవి. సాయుధ పోరాటంలో పది లక్షల ఎకరాలు ప్రజలకు పంచితే నాలుగు లక్షల ఎకరాలు ఈ ప్రాంతంలోనే పంచారు. నాటి పోరాట వారసత్వాన్ని, నేటి పోరాటాలను రెండింటినీ జోడించి ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యం చేయాలి'అని జహంగీర్ వివరించారు.'రాజకీయాల్లో డబ్బు, మద్యం కీలకంగా మారాయి. కమ్యూనిస్టుల వెనుక సామాన్య ప్రజలున్నారు. సామాన్యుల ఆశలను పెంచి వారిని లోబరుచుకునేందుకు డబ్బును పాలకులే అలవాటు చేశారు. డబ్బు ఇస్తేనే ఓటేస్తామంటూ ప్రజలు ఎప్పుడూ అనలేదు. పెట్టుబడిదారులు, వ్యాపారులు రాజకీయాల్లోకి వస్తున్నారు. మాజీ మంత్రి మల్లారెడ్డి చెప్పినట్టు పార్ట్‌టైం రాజకీయ నాయకులు వస్తున్నారు. వారి అవసరాలు, ఆస్తులను కాపాడుకునేందుకు పదవులు ఉపయోగపడుతున్నాయి. అందుకే ఏదైనా చేసి ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారు. స్వలాభం కోసం ప్రలోభాలకు గురిచేస్తున్నారు. కార్పొరేట్ రాజకీయాలను ప్రజలు తిరస్కరించేలా చైతన్యం పెంపొందిస్తాం.'అని జహంగీర్ చెప్పారు.'ఎన్నికల్లో పార్టీల విధానాలను చూసి ఓటేయాలి. బీజేపీ విధానాలు విధ్వంసకరమైనవి. ఆ పార్టీ గెలిస్తే తీవ్ర సంక్షోభం వస్తుంది.

## మండిపడ్డ కెటిఆర్

హైదరాబాద్,అధికార పార్టీ విసురుతున్న వలలో బిఆర్ఎస్ చేపలు పడుతూనే ఉన్నాయి. దేశంలో ప్రస్తుతం ఇవే రాజకీయాలు నడుస్తున్నాయి. గతంలో కెసిఆర్ విసిరిన వలనే ఇప్పుడు సిఎం రేవంత్ రెడ్డి విసురుతున్నారు. తాజాగా తెలంగాణ రాజకీయాలు అనూహ్య పరిణామాల దిశగా నడుస్తున్నాయి. ఎవరూ ఊహించని విధంగా కేశవరావు, అయన కుమార్తె మేయర్ విజయలక్ష్మి, మాజీ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరితో పాటు ఆయన కుమార్తె డాక్టర్ కావ్య కాంగ్రెస్‌లో చేరబోతున్నారు. ఈ క్రమంలో ఇంతపెద్ద ధక్కా బిఆర్ఎస్‌కు తగులుతుందని ఎవరూ ఊహించి ఉండరు.కాంగ్రెస్ ఆహ్వానం మేరకు స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరనున్నారు. తన కూతురు కావ్య సహా సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. వరంగల్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఇద్దరిలో ఒకరికి ఛాన్స్ ఇచ్చే అవకాశం ఉంది. కాంగ్రెస్‌లో కడియం చేరికతో రాజకీయ సమీకరణాలు మారనున్నాయి. కడియం శ్రీహరి బీఆర్ఎస్ ను వీడటంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆ పార్టీకి గట్టి దెబ్బే తగిలే అవకాశం ఉంది. ఇప్పటికే పలువురు నేతలు పార్టీని వీడారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ అధిష్టానం.. లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థి కోసం అన్వేషణ చేస్తోంది. ఈ క్రమంలో మాజీమంత్రి ,నటుడు బాబూ మోహన్‌కు కెసిఆర్ ఫోన్ చేసి ఆహ్వానించినట్లు సమాచారం. బిఆర్ఎస్‌లో చేరితే వరంగల్ టిక్కెట్ ఇస్తానని అన్నట్లుగా సమాచరం. ఆయన నేడోరేపో పార్టీలో చేరి వరంగల్ టిక్కెట్ సాధించవచ్చు. ఆయన గోల్ కూడా వరంగల్ నుంచి పోటీ చేయడం కనుక ఇద్దరి లక్ష్యం నెరవేరుతుంది. మొత్తంగా పార్లమెంట్ ఎన్నికల ముందు బీఆర్ఎస్(ఃఖా)కు షాకుల మీద షాకులు తగులుతున్నాయి. ఇప్పటికే కీలక నేతలందరూ వరుసగా కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో చేరుతున్న విషయం తెలిసిందే. ఇదేకోవలో వరంగల్ లోక్‌సభ అభ్యర్థి కడియం కావ్య కూడా బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ప్రకటించడం పెద్ద దెబ్బే. వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ నుంచి తప్పుకుంటు న్నట్లు కడియం కావ్య స్పష్టం చేశారు. బీఆర్ఎస్ చీఫ్, మాజీ సీఎం కేసీఆర్‌కు ఈ విషయంపై కావ్య లేఖ రాశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం, పార్టీకి జనాదరణ కరువైన నేపథ్యంలో ఎంపీ ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు కావ్య ప్రకటించారు. ఈ క్రమంలోనే స్టేషన్ ఘన్‌పూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా కాంగ్రెస్‌లో చేరనున్నారు. పార్లమెంట్ బరిలో వరంగల్ కాంగ్రెస్ నుంచి కడియం శ్రీహరి లేదా కావ్యకు టికెట్ ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. తాజా ఘటనలపై ఎక్స్‌లో స్పందించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జరగుతున్న పరిణామాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శూన్యం నుంచే సునామీ సృష్టించిన కేసీఆర్ ఇప్పుడు జరుగుతున్న పరిణామాలకు బెదిరిపోతారా అంటు ప్రశ్నించారు. అసాధ్యం అనుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ధీశాలి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అని కొనియాడారు. ఒక్కడుగా బయలుదేరి లక్షల మంది సైన్యాన్ని తయారు చేసి, ఎన్నో అవమానాలు, ద్రోహాలు, కుట్రలు, కుతంత్రాలు అన్నిటిని ఛేదించిన ధీరత్వం కేసీఆర్‌దన్నారు. ఆలాంటి ధీరుడిని కొన్ని కప్పదాట్లు, ద్రోహపు ఎత్తుగడలతో దెబ్బ తీయాలనుకునే రాజకీయ బేహారులకు తెలంగాణ ప్రజలే జవాబు చెబుతారన్నారు. ప్రజా ఆశీర్వాదం, మద్దతుతో 14 ఏళ్లు పోరాడి, ఉద్యమ పార్టీగా తెలంగాణను సాధించి.. తెచ్చుకున్న తెలంగాణ దశను, దిశను మార్చి కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన కేసీఆర్‌ని, బీఆర్ఎస్ పార్టీని ప్రజలే గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటారన్నారు. నికార్సైన కొత్తతరం నాయకత్వాన్ని తయారు చేస్తామని.. పోరాట పంథాలో కదం తొక్కుతామని కేటీఆర్ తెలిపారు. తండ్రిని ఆకాశానికి ఎత్తేశారు. అక్కడితో ఆగిపోని కేటీఆర్ నేతలపై కూడా సెటైర్లు వేశారు. ద్రోహులకు ప్రజలే బుద్ధిచెబుతారంటూ ఫైర్ అయ్యారు. కచ్చితంగా కేసీఆర్‌ను ప్రజలే కాపాడుకుంటారని అన్నారు. ఆలాంటి ధీరుడిని కొన్ని కప్పదాట్లు, ద్రోహపు ఎత్తుగడలతో దెబ్బ తీయాలనుకునే రాజకీయ బేహారులకు తెలంగాణ ప్రజలే జవాబు చెప్తారు. నాయకత్వం తయారు చేయడం కేసీఆర్‌కు కొత్త కాదని... లక్షల మందిని ఉద్యమంవైపు పరుగులు పెట్టించిన కేసీఆర్ వెనక్కి తగ్గబోరని అన్నారు కేటీఆర్. కచ్చితంగా కొత్త నాయకత్వం తయారు చేసుకొని ప్రజల తరఫున పోరాటం చేస్తామంటున్నారు. 'నికార్సైన కొత్తతరం నాయకత్వం తయారుచేస్తాం, పోరాట పంథాలో కదం తొక్కుదాం' అని పోస్టు చేశారు.

## భావోద్వేగాన్నే నమ్ముకున్నారా...

హైదరాబాద్, రాజకీయ నాయకులకు ముందు చూపు ఉండాలి. అధికారంలో ఉన్న వాళ్లకు అది మరింత ఎక్కువ ఉండాలి. వరుస ఎన్నికల్లో గెలిచినంత మాత్రాన చిరకాలం అధికారంలో ఉంటారని కాదు. బలమైన ప్రతిపక్షం లేకపోవడం వల్లే అధికారం దక్కుతోందని రాజకీయ పార్టీలు భావించాల్సి ఉంటుంది. ఇలా అంచనా వేయకపోవడం వల్లే మూడోసారి కేసీఆర్ తెలంగాణలో అధికారానికి దూరమయ్యారు. 2014, 2018 ఎన్నికల్లో వరుసగా విజయాలు సాధించి.. 2023 లో జరిగిన ఎన్నికల్లో హ్యాట్రిక్ సాధించాల్సిన చోట బోల్తాపడ్డారు.. అప్పట్లో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీని చీల్చి చెండాడాడు. అయితే బిజెపి విషయంలో ఆ స్థాయిలో దూకుడు చూపించలేకపోయాడు. చివరికి మోడీతో పెట్టుకుని కొరివితో తల గోక్కున్నాడు. రాజకీయాలలో కేసీఆర్ అపర చాణక్యుడని చాలామంది అంటారు. రాజకీయాల్లో ఆయనను మించిన తలపండిన నాయకుడు లేడని కొనియాడుతుంటారు. కానీ ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయన రాజకీయ చాణక్యం పనికి రాలేదు. తలపండిన ఆయన అనుభవం అక్కరకు రాలేదు. ఈడా బోడా? అని సవాల్ విసిరితే.. ఈడీ వచ్చింది. తన కూతుర్ని అరెస్టు చేసి తీసుకెళ్లింది. పది రోజులపాటు కస్టడీలో ఉంచుకుంది. తర్వాత ఏం చేస్తుందనేది ఇప్పటికీ అంతు పట్టడం లేదు. ఒకవేళ కేసీఆర్ నడుము ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మోడీని సరిగ్గా అంచనా వేసి ఉంటే.. పకడ్బందీగా ప్రణాళికలు అమలు చేసి ఉంటే.. కేసీఆర్‌కు ఈ రోజున ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదని రాజకీయ విశ్లేషకులు భావన. "కానీ ఏం చేస్తాం.. అప్పుడు చెబితే కేసీఆర్ వినిపించుకోలేదు.. ఇప్పుడు చెప్పినా ఉపయోగం లేదని" ఆ పార్టీ నాయకులు నిట్టూర్చుతున్నారు.ఇక గతంలో కేసీఆర్ చేసిన తప్పునే ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్నారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు యాంటీ కేసీఆర్, యాంటీ బీఆర్ఎస్ కోణంలో మాత్రమే రేవంత్ రెడ్డి తన పరిపాలన కొనసాగిస్తున్నారు. ఇంతవరకు ఆయన నరేంద్ర మోడీపై ఒకటి లేదా రెండుసార్లు మాత్రమే విమర్శలు చేశారు. పార్లమెంటు ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైనప్పటికీ రేవంత్ రెడ్డి ఇంతవరకు యాంటీ మోడీ కోణంలో ప్రచారం చేయలేదు. దీనివల్ల జరిగే నష్టం ఏ స్థాయిలో ఉంటుందో కళ్ళ ముందు కేసీఆర్ రూపంలో సజీవ సాక్ష్యం కనిపిస్తూనే ఉంది. అలాంటప్పుడు రేవంత్ రెడ్డి ఎంత త్వరగా మేలుకుంటే అంత మంచిది. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందనే ఊహాగానాలు వ్యక్తమౌతున్న నేపథ్యంలో.. రేవంత్ రెడ్డి ఎంత జాగ్రత్త పడితే అంత మంచిది..ప్రస్తుతం రేవంత్ వ్యవహరిస్తున్న యాంటీ కేసీఆర్, యాంటీ బీఆర్ఎస్ దీర్ఘకాలం ప్రజల్లో భరోసా ఇవ్వలేవు. కొంతకాలం వరకు భావోద్వేగాలతో రాజకీయాలు నడపొచ్చు. గత ప్రభుత్వం చేసిన అవినీతి అక్రమాల మీద బండి లాగించవచ్చు. కానీ అంతిమంగా ప్రభుత్వం ఏం చేసిందనేదే ప్రజలు చూస్తారు. అంతేకాదు కేవలం కేసీఆర్ మీద టార్గెట్ చేస్తే.. బీజేపీని ఎందుకు ప్రశ్నించడం లేదనే మాట కచ్చితంగా ప్రజల నుంచి వస్తుంది. అలాంటి ప్రశ్న ఎదురుగాకముందే తన చేతుల్లో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డి పై ఉంటుంది. పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన తర్వాత భారతీయ జనతా పార్టీ నిశ్శబ్దంగా ఉంటుందనేది అనుమానమే. మహారాష్ట్రలో ఆల్రెడీ శివసేనలో చీలికలు తెచ్చింది.

# ఆ ఐదు స్థానాల్లో ఎవరు?



హైదరాబాద్ : కాంగ్రెస్‌లో వలసలు ఎక్కువ కావడంతో అభ్యర్థులు కూడా మారే అవకాశం ఉందని పార్టీ వర్గా లు పేర్కొంటున్నాయి. ఇప్పటికే 13 స్థానాల ను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ మరో నాలు గు స్థానాలను (ఖమ్మం, వరంగల్, హైదరాబాద్, కరీంనగర్) పెండింగ్‌లో పెట్టడంతో అక్కడ బలమైన అభ్యర్థుల కోసం అన్వేషణ కొనసాగింది. ప్రస్తుతం ఈ నాలుగు స్థానాలకు తోడు సికింద్రాబాద్ అభ్యర్థిని సైతం మార్చవచ్చని తెలుస్తోంది. ఇప్పటికే సికింద్రాబాద్ ఎంపి అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను ప్రకటించగా ఆయన స్థానంలో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ప్రకటించే అవకాశం ఉన్నట్టుగా తెలుస్తోంది. దానం నాగేందర్ ప్రస్తుతం ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన కాంగ్రెస్‌లో చేరే సమయంలో తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని చెప్పి ఎంపి టికెట్‌ను ఆశించినట్టుగా కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఆయన ప్రస్తుతం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండానే సికింద్రాబాద్ ఎంపిగా పోటీ చేస్తానని పేర్కొంటుండడంతో కాంగ్రెస్ పార్టీ అలా కుదరదని చెప్పినట్టుగా తెలిసింది. దీంతో ఆయన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకపోతే ఆయన స్థానంలో సికింద్రాబాద్ నుంచి మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌ను పోటీలో నిలబెట్టే అవకాశం ఉన్నట్టుగా తెలిసింది. ఈనెల 31వ తేదీన ఢిల్లీలో సీఈసీ సమావేశం జరుగనున్న నేపథ్యంలో ఈ 5 స్థానాల అభ్యర్థుల ఎంపికపై మరోమారు చర్చించి వారి జాబితాను ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. మొదటి జాబితాలో నలుగురిని, రెండో జాబితాలో ఐదుగురిని, మూడో జాబితాలో నలుగురి అభ్యర్థుల పేర్లను ఏఐసిసి ప్రకటించగా ఇక నాలుగో జాబితాలో మిగిలిన ఐదు స్థానాల అభ్యర్థుల (ఖమ్మం, వరంగల్, హైదరాబాద్, కరీంనగర్, (సికింద్రాబాద్ ఒకవేళ దానం నాగేందర్ ఒప్పుకోకపోతే) పేర్లను వెల్లడించాలని ఏఐసిసి నిర్ణయించినట్టుగా తెలిసింది. ఇప్పటికే ఈ స్థానాల్లో టికెట్ కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. ఆశావహుల నుంచి ఒత్తిడి నేపథ్యంలో అధిష్ఠానం నిర్ణయం సస్పెన్స్‌గా మారింది. తెలంగాణలో మొత్తం 17 లోక్‌సభ స్థానాలు ఉండగా తాజాగా బుధవారం నలుగురి పేర్ల ప్రకటనతో ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రకటించిన అభ్యర్థుల సంఖ్య 13కు చేరింది. మిగిలిన ఖమ్మం, వరంగల్, హైదరాబాద్, కరీంనగర్ స్థానాలకు ఎంపిక చేయాల్సి ఉంది. అయితే ఇప్పటికి వినపడని పేర్లు సైతం తెరపైకి వస్తుండడంతో అభ్యర్థుల పేర్లను ప్రకటించే వరకు సస్పెన్స్ వీడే అవకాశం లేదని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఖమ్మం నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వేరే పార్టీ వ్యక్తి..!

కాంగ్రెస్ కంచుకోటగా కనిపిస్తున్న ఖమ్మం సీటు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. దీంతో ఖమ్మం అభ్యర్థి ఎంపికపై రాష్ట్ర నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ స్థానం నుంచి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తన సతీమణి నందిని కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన సోదరుడు ప్రసాద్ రెడ్డి కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. వీరితో పాటు తుమ్మల సైతం తన కుటుంబ సభ్యుల కోసం ప్రయత్నిస్తున్నారు. ఖమ్మంలో కమ్మ ఓట్లు కీలకంగా మారడంతో ప్రస్తుతం వేరే పార్టీ ప్రకటించిన అభ్యర్థిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానించి ఆయనకు సీటు ఇచ్చే విషయమై కాంగ్రెస్ ఆలోచిస్తున్నట్టుగా సమాచారం. ప్రస్తుతం ఖమ్మం సీటు కోసం ముగ్గురు మంత్రులు పోటీ పడుతున్న నేపథ్యంలో బయటి వాళ్లను పార్టీలోకి తీసుకొచ్చి ఈ సీటును అప్పగించే అవకాశం ఉన్నట్టుగా తెలిసింది.

హైదరాబాద్ బరిలో సానియామీర్జా

ఖమ్మం, వరంగల్, కరీంనగర్, హైదరాబాద్ స్థానాల్లో పాపులారిటీతో పాటు కుల సమీకరణాలు అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేసే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలోనే ఖమ్మంతో పాటు హైదరాబాద్‌లోనూ బలమైన అభ్యర్థులను నిలపాలని పార్టీ నిర్ణయించినట్టుగా తెలిసింది. ఇక హైదరాబాద్ ఎంపి టికెట్ విషయంలోనూ క్రీడాకారిణి సానియామీర్జాతో పాటు షెహనాజ్ పేర్లను అధిష్టానం పరిశీలిస్తుండగా అందులో సానియా పేరు ప్రముఖంగా వినిపించడం విశేషం.

వరంగల్ సీటు కడియం కుటుంబ సభ్యులకే.!

అలాగే, వరంగల్ టికెట్ కోసం దమ్మాటి సాంబయ్యతో పాటు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన పసునూరి దయాకర్ పోటీ పడుతున్నారు. వారి స్థానంలో కొత్తగా కడియం శ్రీహరి లేదా ఆయన కూతురికి టికెట్ కన్‌ఫం అన్న సంకేతాలను కేడర్‌కు అధిష్టానం చేరవేసినట్టుగా తెలిసింది. అయితే ఇప్పటికే మాలలకు రెండు టికెట్‌లను కాంగ్రెస్ కేటాయించగా మాదిగలకు ఇప్పటివరకు టికెట్‌ను కేటాయించలేదు. రాష్ట్రంలో 60 లక్షల జనాభా ఉన్న మాదిగలకు ఒక్క సీటును కేటాయించ కపోవడం 18 లక్షలున్న మాలలకు పెద్దపల్లి సీటు (గడ్డం వంశీ, మాల), నాగర్‌కర్నూల్ సీటును మల్లు రవి (మాల దాసరి) కేటాయించడంతో ఇప్పటికే పెద్ద ఎత్తున అధిష్టానానికి అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో వరంగల్ సీటునైనా తమకు కేటాయించాలని మాదిగలు డిమాండ్ చేస్తుండగా కొత్తగా కడియం శ్రీహరి, ఆయన కూతురు కావ్యలు బైండ్ల (మాల ఉపకులం) టికెట్‌ను ఆశిస్తుండడం విశేషం.

కరీంనగర్‌లో తీన్మార్ మల్లన్న..!

అలాగే కరీంనగర్‌లో వెలమ, బిసి సామాజిక వర్గం ఓటర్లు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో బిఆర్ఎస్ వెలమ సామాజిక వర్గానికి చెందిన వినోద్‌కుమార్‌ను బరిలోకి దింపగా బిజెపి మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన బండి సంజయ్ కుమార్‌ను రంగంలోకి దింపింది. కాంగ్రెస్ టికెట్ కోసం పలువురు పోటీ పడుతున్నప్పటికీ ఏ సామాజిక వర్గానికి అవకాశం దక్కబోతున్నది అనేది చర్చగా మారింది. ఈ నేపథ్యంలోనే కరీంనగర్ నుంచి మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ ఆయనకంటే బలమైన అభ్యర్థి కోసం రాష్ట్ర నాయకత్వం ఫోకస్ చేసినట్టుగా సమాచారం. ఆయన స్థానంలో బిసి అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న పేరును కూడా అధిష్టాన పరిశీలిస్తున్నట్టుగా తెలిసింది.

# సికింద్రాబాద్ టికెట్‌పై కాంగ్రెస్ పునరాలోచన

హైదరాబాద్, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్ నుంచి సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా ఖరారైన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు హ్యాండ్ ఇచ్చే అవకాశం ఉన్నట్టు ఆ పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతున్నది. తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తే గానీ ఎంపీగా పోటీ చేయొద్దని అధిష్ఠానం మెలిక పెట్టినట్టు ప్రచారం జరుగుతున్నది. కానీ వాస్తవానికి అది కారణమే కాదని, కాంగ్రెస్ తాజాగా నిర్వహించిన ఫ్లాష్ సర్వేలో దానం నాగేందర్ అభ్యర్థిత్వానికి కంటే మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌కే ఓటర్లు అనుకూలంగా ఉన్నట్టు తేలిందని ఆయా వర్గాల సమాచారం. ఈ విషయాన్ని అధిష్ఠాన పెద్దలు బయటికి చెప్పకుండా, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తేనే ఎంపీగా పోటీ చేయాలని దానం నాగేందర్‌కు కండీషన్ పెట్టినట్టు తెలిసింది. ఎంపీగా పోటీ చేసి గెలిచాకే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడానికి కాంగ్రెస్ పెద్ద లు అంగీకరించాకే పార్టీ కండువా కప్పుకున్నానని, ఇప్పుడేమో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని షరతు పెట్టడమేంటని దానం నాగేందర్ మొండికేస్తున్నట్టు సమాచారం. ఇదే కారణంతో సికింద్రాబాద్‌కు అభ్యర్థిని మారుస్తారనే ప్రచారం జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

శ్రీహరి, కావ్యకు ఆహ్వానం

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టేషన్ ఘనపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని తమ పార్టీలో చేరాలని కాంగ్రెస్ పార్టీ నేతల బృందం ఆహ్వానించింది. ఆ బృందం ఆయన ఇంటికి స్వయంగా వెళ్లి ఆయనను కలిసింది. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శులతోపాటు పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లు రవి శుక్రవారం కడియం శ్రీహరి ఇంటికి వెళ్లి చర్చలు జరిపారు. బీఆర్ఎస్ నుంచి వరంగల్ ఎంపీ అభ్యర్థిగా పోటీకి నిరాకరించిన కడియం శ్రీహరి కుతూరు కావ్య కూడా అక్కడే ఉన్నారు. ఈ నేపథ్యంలో తండ్రి, కూతురిలో ఎవరైనా ఒకరు కాంగ్రెస్ నుంచి బరిలోకి దిగాలని వారు ఈ సందర్భంగా కోరారు. ఏఐసీసీ తరఫున కడియం శ్రీహరి, కావ్యను తమ పార్టీలో చేరాల్సిందిగా కోరినట్టు దీపాదాస్ మున్షీ అనంతరం మీడియాకు వెల్లడించారు. తన అనుచరులతో చర్చించి రెండు రోజుల్లో తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని ఈ సందర్భంగా కడియం శ్రీహరి తెలిపారు.





దానంపై అనర్హత వేటు వేయాలి

హైకోర్టులో పిటిషన్ దాఖలు

హైదరాబాద్,బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై హైకోర్టులో పిటిషన్ దాఖలైం ది. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుం డా అధికార పార్టీలో చేరిన ఆయనపై అనర్హత వేటు వేయాలని కోరుతూ ఆ నియోజకవర్గ ఓటరు బీ రాజు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ఇటీవల విచారణ జరిపారు. బీఆర్ఎస్ తరఫున ఎన్నికైన దానం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా కాంగ్రెస్‌లోకి చేరి పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. ఈ నేపథ్యంలో ఆయనపై అనర్హత వేటు వేయాలంటూ మెయిల్ ద్వారా స్పీకర్‌కు వినతి పత్రం సమర్పించామని తెలిపారు. దీంతో ఎమ్మెల్యేపై అనర్హత వేటు వేయాలని పిటిషన్ దాఖలు చేసే అర్హత పిటిషనర్‌కు ఉన్న దా? అని న్యాయమూర్తి ప్రశ్నించారు. స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వడంపై ఏమైనా తీర్పులుంటే సమర్పించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను వాయిదా వేశారు.

# సీఎం రమేష్ వర్సెస్ వైవీ సుబ్బారెడ్డి!





అనకాపల్లి, ఏపీలో ప్రస్తుతం ఆ ఇద్దరు నేతల గురించి జోరుగా చర్చలు నడుస్తున్నాయి. రెండు పార్టీలకు ప్రతినిధులుగా వచ్చిన ఆ ఇద్దరూ వ్యక్తిగత ప్రతిష్ట కోసం దాదాపు యుద్ధమే చేస్తున్నారు. ఈ ఎన్నికలు ఇద్దరికీ ఇజ్జత్ కా సవాలే. సీఎం రమేష్ వర్సెస్ వైవీ సుబ్బారెడ్డి.. స్ట్రాటజీలు-కౌంటర్ స్ట్రాటజీలతో ఉత్తరాంధ్ర రాజకీయాల్ని కాక రేపుతున్నారు. వాళ్లిద్దరి మధ్య ఎందుకింత భగ్గుభగ్గు..? ప్రస్తుతానికి ఎవరిది పైచేయి? ప్రాంతీయ ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో పార్టీని నడిపించాలన్నది వైసీపీ సంస్థాగత స్ట్రాటజీ. ఒక్కొక్కరికి రెండు లేదా మూడు జిల్లాలు.. 30 నుంచి 40 వరకు అసెంబ్లీ సెగ్మెంట్లనిచ్చి.. వాటిల్లో పార్టీ బాగోగుల్ని చూసుకోవడం వీళ్ల బాధ్యత. ఆ కోవలో ఉత్తరాంధ్ర ప్రాంతీయ ఇన్‌చార్జిగా వచ్చిన విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, సజ్జల రామక్రిష్ణారెడ్డి.. ఇప్పుడు అదే సీక్వెన్స్‌లో సీన్లోకొచ్చారు వైవీ సుబ్బారెడ్డి. 2014లోనే ఉత్తరాంధ్ర ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించారు వైవీ సుబ్బారెడ్డి. కానీ.. అప్పుడు పార్టీ ఓటమిపాలవడంతో ఆయన్ను తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల ఇన్‌చార్జిగా పంపారు. ఆసమయంలో ఉత్తరాంధ్ర చార్జ్ తీసుకున్నారు విజయసాయిరెడ్డి. 2019 ఎన్నికలప్పుడు వ్యూహం మార్చి సాయిరెడ్డిని దక్షిణ కోస్తాకు పంపి.. ఆ ప్లేస్‌లో మళ్లీ వైవీ సుబ్బారెడ్డినే ఉత్తరాంధ్రకు పంపింది వైసీపీ హైకమాండ్. పార్టీ అధిష్టానం ప్రతినిధిగా స్థానికంగా శ్రేణుల్ని సమన్వయ పరుస్తూ దాదాపు ఏడాది నుంచి ఉత్తరాంధ్రలో చురుగ్గా తిరుగుతున్నారు వైవీ సుబ్బారెడ్డి. ఈసారి ఎన్నికల్లో పోటీలో లేకపోయినా.. ఉత్తరాంధ్రలో పార్టీ గెలుపు బాధ్యతల్ని భుజాన వేసుకున్నారు వైవీ సుబ్బారెడ్డి.ఇదే గ్యాప్‌లో ఉత్తరాంధ్ర వైపు చూసిన మరో సీమ నేత సీఎం రమేశ్. బీజేపీ రాజ్యసభ ఎంపీగా ఉన్నప్పటికీ%ాా% ఆయన మనసంతా విశాఖ మీదే ఉండేది. ఎంపీగా పోటీ చేయాలనేది ఆయనకున్న బలమైన ఆకాంక్ష. అప్పుడప్పుడూ స్పెషల్ ఫ్లయిటేసుకుని వైజాగ్ వచ్చి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేవారు. కానీ.. జీవీఎల్ నుంచి బలమైన పోటీ ఎదురవడం, టీడీపీ నేత భరత్ పట్టుబట్టడంతో.. సీఎం రమేశ్‌కి విశాఖ ఎంపీ సీటు మిస్సయింది. కానీ.. కూటమి అభ్యర్థిగా అనకాపల్లి ఎంపీగా రేసులో ఉన్నారు సీఎం రమేష్. విశాఖ మెట్రో సిటీ కనుక అక్కడ సామాజిక వర్గాలతో సంబంధం లేదు. అనకాపల్లి ఎంపీ సీటు ఎక్కువగా రూరల్ కవరేజ్ కనుక అక్కడ కులసమీకరణాలే కీలకం. అనకాపల్లిలో తూర్పుకాపుల తర్వాత అతి పెద్ద సామాజికవర్గం వెలమ. తను కూడా వెలమే కనుక.. 3 లక్షల వెలమ ఓట్లున్న అనకాపల్లినే ఎంచుకున్నారు సీఎం రమేష్. పైగా.. స్థానిక నేతలు బండారు సత్యనారాయణ, అయ్యన్నపాత్రుడు, గవిరెడ్డి రామానాయుడు లాంటి వెలమ కులస్థులతో సీఎం రమేశ్‌కి సన్నిహిత సంబంధాలున్నాయి. అందుకే.. అనకాపల్లిలో సీఎం రమేశ్ గెలుపు ఖాయమేనన్న క్లారిటీతో ఉంది విపక్ష కూటమి.సరిగ్గా ఇక్కడే.. సీఎం రమేశ్ దూకుడును అడ్డుకోడానికి రంగంలో దిగారు వైవీ సుబ్బారెడ్డి. బీసీలకు అడ్డాగా ఉన్న ఉత్తరాంధ్రలో బీసీలకు ఇవ్వకుండా ఓసీకి, పైగా నాన్‌లోకల్‌కి టికెట్ ఇచ్చారంటూ సీఎం రమేష్ టార్గెట్‌గా కొత్త నినాదం తీసుకొచ్చారు వైవీ. నేను నాన్ లోకలైతే.. వైవీ సుబ్బారెడ్డి ఏంటి.. అనేది అట్నుంచి వస్తున్న రివర్స్ ఎటాక్. ఆర్థికంగా స్థితిమంతుడు కనుక.. సీఎం రమేశ్ హవాను తెగ్గొట్టడానికి తమ వ్యూహానికి మరింత పదును పెట్టక తప్పలేదు వైసీపీకి. అందులో భాగమే.. అనకాపల్లి వైసీపీ ఎంపీ అభ్యర్థిగా బరిలో దిగిన బూడి ముత్యాలనాయుడు. మా వోడు బీసీ వెలమ.. పైగా లోకల్ వెలమ. మీ వోడు ఆర్థికంగా బలమైన వెలమ.. మావోడు సామాన్య వెలమ.. అంటూ తమ అభ్యర్థితో కౌంటర్ స్ట్రాటజీ మొదలుపెట్టారు వైవీ సుబ్బారెడ్డి. అసలు సీఎం రమేష్ తమకు పోటీనే కాదనేది ఆయన వెర్షన్. ఇప్పటికే అనకాపల్లిలో మకాం పెట్టేశారు సీఎం రమేశ్. సింహాచలం నుంచి రోడ్‌షో ద్వారా వచ్చిన ఎంపీ అభ్యర్థికి కూటమి పార్టీల క్యాడర్ బ్రహ్మరథం పట్టింది. మొదట్లో కొణతాల రామకృష్ణ.. తర్వాత కొణిదెల నాగబాబు.. ఆ తర్వాత పవన్‌కల్యాణ్.. ఇన్ని పేర్లు మారాక తన చేతికి చిక్కిన అనకాపల్లి ఎంపీ సీటును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు సీఎం రమేశ్. గతంలో తెలుగుదేశంలో ఉన్నప్పుడు చంద్రబాబుకు కుడిభుజంగా వ్యవహరించిన రాయలసీమ నేత సీఎం రమేశ్. ఇప్పుడు ఉత్తరాంధ్ర వైపు ఫేస్ టర్న్ ఇచ్చుకోవడం ఒక నాటకీయ పరిణామం. ఇక్కడ మరో సీమ నేత వైవీ సుబ్బారెడ్డితో వ్యూహాత్మక పోరాటం చేయాల్సి రావడం మరో ఇంట్రస్టింగ్ విషయం. ఇలా ఇద్దరు సీమ లీడర్ల మధ్య జరిగే ప్రచ్ఛన్న యుద్ధానికి ఉత్తరాంధ్ర కేరాఫ్ కావడం సిసలైన కొసమెరుపు.

# రాజయ్య ఇంటికి బిఆర్ఎస్...

హైదరాబాద్ : లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. వరంగల్ బిఆర్ఎస్‌కు చెందిన ఓ కీలక నేత పార్టీని వీడితే మరో ముఖ్య నేత మరోసారి చేరేందుకు సిద్ధమయ్యా రు. అసెంబ్లీ టికెట్ దక్కపోవడంతో బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎంఎల్ఏ తాటికొండ రాజయ్య బిఆర్ఎస్‌లోకి రీ ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు బిఆర్ఎస్ పార్టీకి చేసిన రాజీనామా ను ఉపసంహరించుకోబోతున్నట్లుగా సమాచా రం. ఇప్పటికే రాజయ్యతో బిఆర్ఎస్ నేతలు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సమావేశమైనట్లు తెలిసింది. శనివారం రాజయ్య నేరు గా బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌తో భేటీ కానున్న ట్లు సమాచారం. ఒకవేళ కడియం శ్రీహరి వరంగల్ నుంచి ఎంపీగా పోటీ చేస్తే.. ఆయన మీద పోటీగా రాజయ్యను బరిలోకి దింపేందుకు బిఆర్ఎస్ చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. అయితే పార్టీలో చేరికపై తన కార్యకర్తలతో చర్చించి చెబుతానని రాజయ్య బిఆర్ఎస్ నేతలకు చెప్పినట్లు సమాచారం.కాగా, గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఇవ్వకపోవడంతో బిఆర్ఎస్ పార్టీకి రాజయ్య రాజీనామా చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ప్రయత్నించారు. కానీ కాంగ్రెస్‌లో చేరలేదు. మరోవైపు ఆయన రాజీనామాను కూడా కెసిఆర్ ఆమోదించలేదు. మరోవైపు అనూహ్యంగా వరంగల్ ఎంపీ స్థానం నుంచి తప్పుకుంటున్నట్లు కడియం కావ్య ప్రకటించారు. తండ్రితో కలిసి ఆమె కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ తాజా రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తిరిగి రాజయ్య పేరు తెరపైకి వచ్చింది. తన ప్రత్యర్థి ప్రస్తుతం కాంగ్రెస్‌లో చేరనుండటంతో మళ్లీ సొంతగూటికి వచ్చేందుకు రాజయ్య సన్నాహాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇటు వరంగల్ బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా తాడికొండ రాజయ్యను ఎంపిక చేసారన్న ప్రచారం జరుగుతుంది.



# బీజేపీకి అసమ్మతి సెగ.. 100 సీట్లలో అభ్యర్థులను మార్చాలంటూ ఆందోళనలు

హైదరాబాద్, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 400కుపైగా స్థానాల్లో విజయం సాధించాలని ప్రధాని నరేంద్రమోదీ బీజేపీ శ్రేణులకు లక్ష్యాన్ని నిర్దేశించగా.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. పార్టీ అధిష్ఠానం ప్రకటించిన అభ్యర్థులపై కార్యకర్తలు తీవ్రంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. అభ్యర్థులకు వ్యతిరేకంగా కరపత్రాలు పంపిణీచేస్తున్నారు. దాదాపు 100 సీట్లలో రెబల్స్ తిరుగుబాటుకు దిగారు. మోదీ, అమిత్ షాల సొంత రాష్ట్రం గుజరాత్‌తో పాటు హర్యానా, రాజస్థాన్, బీహార్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో కూడా అభ్యర్థుల ప్రకటనతో తీవ్ర వ్యతిరేకత నెలకొంది.

103 మంది సిట్టింగ్‌లకు మొండి చేయి

బీజేపీ ఇప్పటివరకు 407 సీట్లకు అభ్యర్థులను ప్రకటిస్తే, అందులో 103 మంది సిట్టింగ్ ఎంపీలకు టికెట్లు ఇవ్వలేదు. దీంతో వారిలో చాలామంది ధిక్కార స్వరాన్ని వినిపిస్తున్నారు. తమను కాదని రాత్రికి రాత్రి పార్టీ మారి వచ్చి చేరిన ఇతర నాయకులకు టికెట్లు కేటాయించడంపై పలు చోట్ల కార్యకర్తలు నిరసనలు చేపట్టారు. గుజరాత్‌లో 14 మంది సిట్టింగ్ ఎంపీలకు బీజేపీ టికెట్ ఇవ్వకపోవడంతో అసమ్మతి నెలకొంది.

రెబల్స్‌గా బరిలోకి..

80 లోకసభ స్థానాలున్న ఉత్తర ప్రదేశ్‌లో 9 సిట్టింగ్ ఎంపీలకు టికెటివ్వలేదు. మధ్యప్రదేశ్‌లో 9, ఢిల్లీలో ఆరుగురు, ఒడిశాలో నలుగురు (21 సీట్లు), బీహార్‌లో ముగ్గురు (40 సీట్లు), ఛత్తీస్‌గఢ్‌లో 9 మంది (11 సీట్లు), రాజస్థాన్‌లో 10 (25 సీట్లు), మధ్యప్రదేశ్‌లో ఇప్పటి వరకు ప్రకటించిన 24 సీట్లలో 10 సిట్టింగ్‌లకు టికెట్లు ఇవ్వలేదు. హర్యానాలో 10 సీట్లలో సిట్టింగ్‌లను మార్చి కొత్తవారిని రంగంలోకి దించడంతో కార్యకర్తల్లో అసంతృప్తి ఎక్కువగా కనిపిస్తున్నది. కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో కూడా అదే పరిస్థితి నెలకొంది. కర్ణాటకలో 10 మంది సిట్టింగ్‌లకు టికెట్లు కేటాయించలేదు. అంతేకాదు మరో 10 సీట్లలో అసంతృప్త బీజేపీ నాయకులే రంగంలో ఉన్నారు.



తెలుగు రాష్ట్రాల్లోనూ..

ఆంధ్ర ప్రదేశ్‌లో కూడా తెలుగుదేశం, జనసేనలతో పొత్తు మూలంగా పలు చోట్ల టికెట్లు ఆశించి భంగపడ్డ బీజేపీ నేతలు అసంతృప్తితో ఉన్నారు. బీజేపీకి 6 లోకసభ, 10 అసెంబ్లీ స్థానాలు కేటాయించడంతో అక్కడ టికెట్లు కోల్పోయిన నేతలు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. తెలంగాణలో కూడా సికింద్రాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మినహా అన్ని చోట్లా అసంతృప్తి సెగలు రేగాయి. హైదరాబాద్, మల్కాజిగిరి, హైదరాబాద్, జహీరాబాద్, నాగర్‌కర్నూల్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ లోకసభ సీట్లలో కూడా చాలా వ్యతిరేకత కనిపిస్తున్నది.

# అనంత టిడిపిలో భగ్గుమన్న అసంతృప్తి

అనంతపురం,అనంతపురం టీడీపీలో అసంతృప్తి భగ్గుమంది. టికెట్ ఆశించి భంగపడ్డ అభ్యర్థి అనుచరులు టీడీపీ కార్యాయంలో బీభత్సం సృష్టించారు. కార్యాలయ ఫర్నిచర్‌ను ధ్వంసం, దహనం చేసి నిరసన తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థుల తుది జాబితాను శుక్రవారం ప్రకటించారు. అనంతపురం అభ్యర్థిగా దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ పేరును ప్రకటించారు.దీంతో ఈ స్థానం నుంచి టికెట్ ఆశించిన ప్రభాకర్ చౌదరి వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అనంతపురం పట్టణంలో ఉన్న టీడీపీ కార్యాలయం తలుపులను బద్దలు కొట్టి లోనికి ప్రవేశించారు. ఫర్నిచర్‌ను , టీడీపీ జెండాను, చంద్రబాబు ఫ్లెక్సీలను బయటకు తీసుకువచ్చి దహనం చేశారు. చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ చౌదరి మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు ఇలాంటి నిర్ణయం తీసుకుంటారని కలలో కూడా అనుకోలేదని పేర్కొన్నారు. పార్టీకోసం అహర్నిశలు పనిచేసిన నాయకులకు తగిని గుర్తింపు లేకుంటే పార్టీ మనుగడ కష్టమని ఆరోపించారు. తన భవిష్యత్ కార్యక్రమాన్ని శనివారం పార్టీనాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

## అమిత్ షాను కలిసిన నవనీత్ కౌర్ దంపతులు

ఢిల్లీలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను నవనీత్ కౌర్ దంపతులు కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అమిత్ షాతో చర్చించారు. ఇటీవలే నవనీత్ కౌర్‌కు మహారాష్ట్రలోని అమరావతి నుంచి బీజేపీ లోక్‌సభ అభ్యర్థిగా నవనీత్ కౌర్ పేరును ప్రకటించింది. గతంలో 2019 ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగి విజయం సాధించారు. అనంతరం బీజేపీకి దగ్గరయ్యారు. తాజాగా అదే సీటు బీజేపీ నుంచి లభించింది. దీంతో బీజేపీ ముఖ్య నేతలను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. గురువారం మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఫడ్నవిస్‌ను కూడా ఈ దంపతులు కలిశారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com